


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 04-11-2025 | సంపుటి - 25 | సంచిక -169 | రూ : 4 | పేజీలు: 8


## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో రాజకీయం తగదు

- టన్నెల్ పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్న రేవంత్ రెడ్డి
- టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు పూర్తి చేయడం కష్టంగా మారిందని వ్యాఖ్య
- బీఆర్ఎస్ హయాంలో 10 కిలోమీటర్లు కూడా పూర్తి చేయలేక పోయారని విమర్శ



2లో



2లో

## చేవెళ్ల.. ఘోర ప్రమాదం..

### మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం

- రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఈ దుర్ఘటనలో 19 మంది దుర్మరణం
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం
- గాయపడిన వారికి రూ.2 లక్షల ఆర్థిక సాయం
- ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన



2లో

## చేవెళ్ల ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి.. మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియో ప్రకటన

- రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆర్టీసీ బస్సు, కంకర లారీ ఢీకొని 19 మంది దుర్మరణం
- ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున పరిహారం
- గాయపడిన వారికి రూ. 50 వేల ఆర్థిక సాయం

## బుధవారం ప్రధాని ని కలవనున్న టీమిండియా అమ్మాయిలు!



2లో

- మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన టీమిండియా
- విజేత జట్టుతో ప్రధాని మోదీ బుధవారం భేటీ
- క్రీడాకారులకు బీసీసీఐ రూ. 51 కోట్ల భారీ నజరానా ప్రకటన
- ఫైనల్లో సత్తా చాటిన షఫాలీ వర్మ, దీప్తి శర్మ
- ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో ఘన విజయం
- నవీ ముంబై నుంచి ఢిల్లీకి బయల్దేరనున్న జట్టు సభ్యులు



2లో

## కేసీఆర్ తనయుడు, కవిత మధ్య పోరు..

- వారసత్వ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ముప్పు అన్న శశిథరూర్
- తెలంగాణలో కేసీఆర్ తనయుడు, కవిత మధ్య వారసత్వ పోరు కొనసాగుతోందన్న థరూర్
- వారసత్వ నాయకత్వంతో పాలనా నాణ్యత దెబ్బతింటుందని వ్యాఖ్య

## రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి కేంద్రంపై విమర్శలు..

### కాల్పుల విరమణ పొడిగించిన మావోలు



2లో



## కోట్ల రూపాయలు.. వజ్రాల హారాలు

ముంబయి: చరిత్రాత్మక వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టుపై నజరానాల వర్షం కురుస్తోంది. హర్మన్‌ప్రీత్ బృందానికి బీసీసీఐ రూ.51 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. కప్ గెలిచినందుకు భారత్‌కు ఐసీసీ నుంచి రూ.37.3 కోట్లు దక్కాయి. వ్యక్తిగతంగానూ క్రీడాకారులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నగదు బహుమతి ప్రకటించాయి. హిమాచల్ ప్రదేశ్.. పేసర్ రేణుక సింగ్‌కు రూ.కోటి ఇవ్వనుంది. ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇస్తామని ఆ రాష్ట్ర సీఎం సుఖ్వీందర్ సింగ్ తెలిపారు. పేసర్ క్రాంతి గౌడ్‌కు ఆమె సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్ రూ.కోటి నజరానా ఇస్తున్నట్లు తెలిపింది.

వజ్రాల హారాలతో: సూరత్‌కు చెందిన వ్యాపారవేత్త, రాజ్యసభ సభ్యుడు గోవింద్ డోలాకియా భారత మహిళా క్రికెటర్లకు ఒక్కొక్కరికి వజ్రాల హారాలు ఇస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాక క్రికెటర్ల ఇళ్లకు సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## వ్యక్తిగత పర్యటనలోనూ సీఎం పెట్టుబడుల వేట

- లండన్ లో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు
- పారిశ్రామిక దిగ్గజాలతో వరుసగా కీలక సమావేశాలు
- విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- రోల్స్ రాయిస్, ఆక్టోపస్ ఎనర్జీ వంటి అంతర్జాతీయ సంస్థలతో ఫలవంతమైన చర్చలు
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని వివరించి పెట్టుబడులకు పిలుపు



2లో

# వ్యక్తిగత పర్యటనలోనూ సీఎం చంద్రబాబు పెట్టుబడుల వేట

అమరావతి, నవంబర్ 03 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన వ్యక్తిగత పర్యటన నిమిత్తం లండన్‌లో ఉన్నప్పటికీ, రాష్ట్రాభివృద్ధే ఏకైక అజెండాగా ముందుకు సాగుతున్నారు. రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఆయన అక్కడ పారిశ్రామిక దిగ్గజాలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. సోమవారం నాడు లండన్‌లో పలు ప్రముఖ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో భేటీ అయిన ముఖ్యమంత్రి, నవ్యాంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను వారికి క్షుణ్ణంగా వివరించారు.

*** విశాఖ సదస్సుకు ఆహ్వానం.. ఏపీ విధానాలపై ప్రశంసలు**

ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నం వేదికగా జరగనున్న ప్రతిష్ఠాత్మక 'సీఐఐ భాగస్వామ్య సదస్సు'కు హాజరు కావాల్సిందిగా పారిశ్రామికవేత్తలను చంద్రబాబు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలను, పెట్టుబడిదారులకు అందిస్తున్న సహకారాన్ని ఆయన తెలియజేశారు. "గతంలో ఉన్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' స్థానంలో తాము 'స్పీడ్ డూయింగ్ బిజినెస్' అనే నూతన విధానాన్ని అమలు చేస్తున్నామని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను అత్యంత వేగంగా, పారదర్శకంగా అందిస్తున్నామని" చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రానికి ఆదాయంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలకు రెడ్ కార్పెట్ పరుస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా భవిష్యత్తును శాసించే గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్లు, ఏవియేషన్ వంటి కీలక రంగాలపై దృష్టి సారించాలని ఆయన పారిశ్రామికవేత్తలను కోరారు.

*** ఆక్టోపస్ ఎనర్జీతో ఇంధన రంగంపై చర్చలు**

ఈ సమావేశాల పరంపరలో భాగంగా, లండన్‌లోని అతిపెద్ద విద్యుత్ సరఫరాదారుగా పేరుగాంచిన ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ క్రిస్ ఫిట్జ్ గెరాల్డ్ తో సీఎం భేటీ అయ్యారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపార అవకాశాలను ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకుందని తెలిపారు. అమరావతి, విశాఖపట్నం వంటి నగరాల్లో స్మార్ట్ గ్రిడ్, డేటా అనలిటిక్స్, ఆధునిక టెక్నాలజీతో కూడిన విద్యుత్ సరఫరా, నియంత్రణ వంటి రంగాల్లో పనిచేసేందుకు ముందుకు రావాలని ఆక్టోపస్ ఎనర్జీని ఆహ్వానించారు. విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక పాలసీలను వివరిస్తూ, విశాఖ సదస్సుకు పక్కా ప్రతిపాదనలతో రావాలని కోరారు.

## చేవెళ్ల ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి.. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో ప్రకటన

ఢిల్లీ, నవంబర్ 03 : రంగారెడ్డి జిల్లాలో సోమవారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో ఆర్టీసీ బస్సు, కంకర లారీ ఢీకొన్న ఘటనలో 19 మంది ప్రయాణికులు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, కంకర లోడుతో వెళుతున్న లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ఘోర దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. ప్రమాద మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. అదేవిధంగా గాయపడిన వారికి రూ. 50 వేల పరిహారం అందిస్తామని వెల్లడించారు. ప్రమాద వార్త తెలియగానే స్థానిక అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు.

## కేసీఆర్ తనయుడు, కవిత మధ్య పోరు..
## వారసత్వ రాజకీయాలపై శశిథరూర్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 03 : వారసత్వ రాజకీయాల్లో ప్రతిభకు పట్టం కట్టాల్సిన సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ అభిప్రాయపడ్డారు. వారసత్వ రాజకీయాలు భారత ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు కలిగిస్తాయని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కేసీఆర్ తనయుడు కేటీఆర్, కుమార్తె కవితల మధ్య వారసత్వ పోరు కొనసాగుతోందని ఒక వార్తా సంస్థ కథనంలో ఆయన పేర్కొన్నారు. సామర్థ్యం, నిబద్ధత, క్షేత్రస్థాయిలో పనితీరు వంటి అంశాల ఆధారంగా కాకుండా వారసత్వం ద్వారా రాజకీయ అధికారాన్ని నిర్ణయిస్తే పరిపాలనా నాణ్యత దెబ్బతింటుందని ఆయన అన్నారు. అన్ని పార్టీలలోనూ కుటుంబ రాజకీయాలు సహజంగా కనిపిస్తుంటాయని శశిథరూర్ పేర్కొన్నారు. నెహ్రూగాంధీ వంశ ప్రభావం స్వాతంత్ర్య పోరాటంతో ముడిపడి ఉండటం వల్ల దశాబ్దాలుగా ఒకే కుటుంబం రాజకీయాలను శాసిస్తోందని అన్నారు. రాజకీయ నాయకత్వం అనేది పుట్టుకతో వచ్చే హక్కు అనే భావనను ఇది స్థిరపరిచిందని ఆయన అన్నారు. ప్రతి పార్టీ, ప్రాంతం, స్థాయిలోనూ ఇది చొచ్చుకుపోయిందని అన్నారు. బిజూ పట్నాయక్‌నవీన్ పట్నాయక్, బాల్ ఠాక్రేఆదిత్య ఠాక్రే, ములాయం సింగ్ యాదవ్‌అఖిలేశ్ యాదవ్, ఫరూఖ్ అబ్దుల్లాఒమర్ అబ్దుల్లా, కరుణానిధిఎం.కె. స్టాలిన్‌ఉదయనిధి వంటి ఉదాహరణలను ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగానే ఆయన కేసీఆర్ వారసుల అంశాన్ని ప్రస్తావించారు. కుటుంబం అనేది ఒక బ్రాండ్‌గా ఉపయోగపడటం ఈ తరహా రాజకీయాలకు ఒక కారణం కావొచ్చని ఆయన అన్నారు. ఇంట్లో ఒకరికి గుర్తింపు లభిస్తే తదుపరి తరం అభ్యర్థులకు ఓటర్లను ఆకట్టుకోవడానికి, విశ్వాసాన్ని పెంచుకోవడానికి అంతగా కష్టపడాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో ప్రతిభను ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైందని

## బుధవారం ప్రధాని మోదీని కలవనున్న
## టీమిండియా అమ్మాయిలు!

ఢిల్లీ, నవంబర్ 03 : మహిళల వన్డే ప్రపంచకప్‌లో చారిత్రక విజయం సాధించి, తొలిసారి కప్పును ముద్దాడిన భారత జట్టు సభ్యులు ప్రధాని నరేంద్ర మోదీని కలవనున్నారు. ఐసీసీ మెగా టోర్నీ విజేతలుగా నిలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన బుధవారం ఢిల్లీలో ప్రధానితో సమావేశం కానున్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ చారిత్రక విజయాన్ని పురస్కరించుకుని బీసీసీఐ జట్టుకు రూ. 51 కోట్ల భారీ నగదు బహుమతిని ప్రకటించింది. ఆదివారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శన చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' షఫాలీ వర్మ (87) అద్భుత ఇన్నింగ్స్, 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' దీప్తి శర్మ (58) మెరుపులతో 7 వికెట్లకు 298 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) శతకంతో పోరాడినా, భారత బౌలర్ల ధాటికి తలవంచక తప్పలేదు. ముఖ్యంగా దీప్తి శర్మ 5 వికెట్లతో సత్తా చాటడంతో దక్షిణాఫ్రికా 246 పరుగులకే ఆలౌట్ అయింది. దీప్తి ఆఖరి వికెట్ తీయగానే దేశవ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. భారత సీనియర్ మహిళల జట్టుకు ఇదే తొలి ఐసీసీ ట్రోఫీ కావడంతో ఈ విజయం మరింత ప్రత్యేకంగా నిలిచింది. ప్రస్తుతం నవీ ముంబైలో ఉన్న క్రీడాకారిణులు, సహాయక సిబ్బంది మంగళవారం సాయంత్రం ఢిల్లీకి బయల్దేరనున్నారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో రాజకీయం తగదు

హైదరాబాద్, నవంబర్ 03 : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో బీఆర్ఎస్ రాజకీయం చేయడం సరికాదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూలు జిల్లా మన్నెవారిపల్లెలో పర్యటించిన ముఖ్యమంత్రి, హెలీ మాగ్నటిక్ సర్వేకు సిద్ధంగా ఉన్న హెలికాప్టర్, ఆధునాతన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు చేయడం కష్టంగా మారిందని అన్నారు. ఈ పనులపై రాజకీయం చేయవద్దని కోరారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా టన్నెల్ పనులు పూర్తి చేసి తీరుతామని అన్నారు. ప్రాజెక్టు మంజూరు చేసినప్పుడు పనుల అంచనా విలువ రూ. 1,986 కోట్లు అని, రెండు దశాబ్దాల్లో ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడే నాటికి 30 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తయిందని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదన్నరేళ్లలో 10 కిలోమీటర్ల టన్నెల్ కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. పెద్దగా కమీషన్లు రావని ఈ టన్నెల్‌ను పక్కకు పెట్టారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడును విస్తరిస్తుంటే కేసీఆర్ అప్పుడు చూస్తూ ఊరుకున్నారని ఆరోపించారు. రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఉంటే ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీరు అందేదని చెప్పారు. కృష్ణానది మీద చెపట్టిన అన్ని ప్రాజెక్టులను కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు రూ. 1.86 లక్షల కోట్లు చెల్లించారని, ఆ మొత్తంలో కాళేశ్వరం ప్రాజెక్టుకే రూ. 1.06 లక్షల కోట్లు చెల్లించారని రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత గత పదేళ్లలో ఏపీ ప్రభుత్వం కృష్ణా నదిపై ప్రాజెక్టులు నిర్మిస్తే, కేసీఆర్ మాత్రం ఏమీ నిర్మించలేకపోయారని మండిపడ్డారు.

## రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి, కేంద్రంపై విమర్శలు..
## కాల్పుల విరమణ పొడిగించిన మావోలు

హైదరాబాద్, నవంబర్ 03 :తెలంగాణలో కాల్పుల విరమణను మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్లు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో సోమవారం ఓ అధికారిక లేఖ విడుదలైంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు లేఖలో స్పష్టం చేశారు. గత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రాష్ట్రంలో శాంతియుత వాతావరణం కోసం వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజిక వర్గాలు ఉద్యమించాయని, వారి ఆకాంక్షలకు అనుగుణంగానే తాము గత మే నెలలో ఆరు నెలల పాటు కాల్పుల విరమణ ప్రకటించామని జగన్ గుర్తుచేశారు. ఆ గడువు ముగిసిన నేపథ్యంలో, ప్రజల అభీష్టం మేరకు మరో ఆరు నెలల పాటు ఈ విరమణను కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గడిచిన ఆరు నెలల కాలంలో తమ వైపు నుంచి సంపూర్ణంగా శాంతియుత వాతావరణానికి కట్టుబడి ఉన్నామని, భవిష్యత్తులోనూ ఇదే పంథాను అనుసరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలో వ్యవహరించిన విధంగానే సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం తెలంగాణలో నెలకొన్న శాంతి వాతావరణానికి భంగం కలిగించేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తన లేఖలో తీవ్ర ఆరోపణలు చేశారు.

## చేవెళ్ల ఘోర ప్రమాదం..
## మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం

హైదరాబాద్, నవంబర్ 03 : రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించింది. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి పరిహారం ప్రకటించింది. ఈ వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. బాధితుల కుటుంబ సభ్యులకు ఇప్పటికే సమాచారం అందించినట్లు చెప్పారు. మృతదేహాలకు చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయిన తర్వాత మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు సకాలంలో అప్పగించేందుకు ప్రత్యేకంగా అధికారులను నియమించామని ఆయన వివరించారు. ప్రభుత్వం అన్ని విధాలా బాధితులకు సహాయం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

## పిల్లాడిలా ఎంజాయ్ చేసిన మంత్రి నారా లోకేష్

ముంబైలో జరిగిన మహిళ వన్డే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను ఏపీ మంత్రి నారా లోకేష్.. తన భార్య బ్రాహ్మణి, కొడుకు దేవాన్ష్‌తో కలిసి వీక్షించారు. మంత్రితో పాటు రాజ్యసభ ఎంపీ సనా సతీష్ తన కుటుంబంతో కలిసి మ్యాచ్ చూశారు. ఈ సందర్భంగా.. టీమిండియా విజయాన్ని లోకేష్ ఎంజాయ్ చేశారు. వరల్డ్ కప్ ట్రోఫీతో పాటు తనకు ఎంతో ఇష్టమైన మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌తో ఫొటోలు తీసుకుని.. క్రికెట్ లవర్‌గా ఎంజాయ్ చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## ఏపీకి పెట్టుబడుల జాతర...
## రూ.9.8 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలకు రంగం సిద్ధం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ ముందడుగు వేస్తోంది. పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తూ, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నం వేదికగా ప్రతిష్ఠాత్మక 'సీఐఐ భాగస్వామ్య సదస్సు'ను నిర్వహించనుంది. ఈ సదస్సు ద్వారా రాష్ట్రంలోకి రూ.9.8 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, 7.5 లక్షల ఉద్యోగాలను సృష్టించే దిశగా కీలకమైన 410 అవగాహన ఒప్పందాలు (MoUలు) కుదరనున్నాయని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈ సదస్సు కేవలం పెట్టుబడులకే పరిమితం కాకుండా.. ప్రజలు, ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థల మధ్య ఒక బలమైన త్రైపాక్షిక భాగస్వామ్యానికి నాంది పలుకుతుందని స్పష్టం చేసింది. ఈ సదస్సు వివరాలను ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలను సృష్టించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ సదస్సు ఒక శుభారంభం (కర్టెన్ రైజర్) వంటిదని ఆయన అభివర్ణించారు. అభివృద్ధిని కేవలం ఒకే ప్రాంతానికి పరిమితం చేయకుండా, రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి విస్తరింపజేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రానికి వచ్చే ప్రతి పెట్టుబడి, యువత సాధికారతకు దోహదపడాలన్నదే తమ ఆశయమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, "వేగాన్ని కోరుకునే కంపెనీలు, ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుంటాయి" (Companies that choose speed, choose Andhra Pradesh) అనే నినాదాన్ని ఆయన ఆవిష్కరించారు. "ఈ సదస్సు మన ప్రజలు, మా ప్రభుత్వం, భవిష్యత్ ప్రణాళికలు కలిగిన కార్పొరేట్ సంస్థల మధ్య ఒక గొప్ప భాగస్వామ్యం. ఇక్కడ కుదిరే ప్రతి ఒప్పందం మన యువత కలలకు మేము ఇచ్చే హామీ. ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం అంటే వేగాన్ని, నమ్మకాన్ని, అవకాశాన్ని ఎంచుకోవడమే. తెలుగు వారి ఆత్మగౌరవం పునాదిగా, ప్రపంచ స్థాయి నాయకత్వం కోసం నిర్మించిన వేదిక ఇది" అని మంత్రి నారా లోకేశ్ వివరించారు.

*** సదస్సు ముఖ్యాంశాలు, ప్రముఖుల హాజరు**

ఈ రెండు రోజుల సదస్సులో మొత్తం 48 సెషన్లు జరగనున్నాయి. ఇందులో ఒక ప్లీనరీ, 27 టెక్నికల్ సెషన్లు, 3 స్టాండలోన్ సెషన్లు, 11 రాష్ట్రాలకు సంబంధించిన ప్రత్యేక సెషన్లు ఉంటాయి. జీ20 సభ్య దేశాలతో సహా 45 దేశాల నుంచి 300 మంది విదేశీ ప్రతినిధులు, 72 మంది అంతర్జాతీయ వక్తలు పాల్గొననున్నారు. ఈ సదస్సు ప్రాధాన్యతను తెలియజేస్తూ, కేంద్ర ప్రభుత్వం నుంచి పలువురు కీలక మంత్రులు హాజరు కానున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి, సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) డా. జితేంద్ర సింగ్ వంటి ప్రముఖులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు మద్దతు తెలపనున్నారు. అంతేకాకుండా, ఒప్పందాలతో పాటు రాష్ట్రంలో వికేంద్రీకృత అభివృద్ధిని బలపరుస్తూ, 2.5 లక్షల ఉద్యోగాలను సృష్టించే రూ.2.7 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు కూడా చేయనున్నారు.

*** గత 16 నెలల ప్రగతి.. కంపెనీలు ఏపీని ఎందుకు ఎంచుకుంటున్నాయి?**

గత 16 నెలల్లో తమ ప్రభుత్వం సాధించిన పారిశ్రామిక ప్రగతిని లోకేశ్ ప్రముఖంగా ప్రస్తావించారు. ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రూ.1.5 లక్షల కోట్లతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌ను నెలకొల్పేందుకు కేవలం 14 నెలల్లోనే ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో అనుమతులు ఇచ్చామని గుర్తుచేశారు. గూగుల్ సంస్థ విశాఖలో డేటా, ఏఐ హబ్ ఏర్పాటుకు సుమారు రూ.15 బిలియన్ల



# దేశ సైనికులపై అనుచిత వ్యాఖ్యలు తగవు

- సీఎం దిష్టిబొమ్మ దహనం
- కైరంకొండ అశోక్

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి హిందువుల పైన, భారతదేశ సైనికులపైన అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని బిజెపి మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్ అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రం జాతీయ రహదారిపై బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా కైరంకొండ అశోక్ మాట్లాడుతూ పూటకో పార్టీ మారే సీఎం భారత సైన్యం చరిత్ర తెలియని మూర్ఖుడని ఆరోపించారు. ఆపరేషన్ సింధూరపైన అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీకి పాకిస్తాన్ మీద ఉన్న ప్రేమ పుట్టిన దేశం మీద లేకపోవడం సిగ్గుచేటని ఆరోపించారు. ఎంఐఎం పార్టీ ఓటు బ్యాంకు కోసం హిందువుల పైన భారతీయ జనతా పార్టీ పైన నోటికొచ్చినట్టు మాట్లాడడం సరికాదని దుయ్యబట్టారు. భారత సైన్యాన్ని అవమానిస్తే కేసీఆర్ కు ప్రజలు చెప్పిన గుణపాఠమే రేవంత్ రెడ్డికి కూడా చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, నాయకులు గుజ్జుల సురేందర్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, చినుకని మల్లేష్ యాదవ్, యాస అశోక్ రెడ్డి, పబ్బతి శేఖర్ గౌడ్, కట్ట కృష్ణ, లగ్గోని పాండు, పోట్టబత్తిని బాలరత్నం, పులిగిల్ల శ్రీనివాస్ చారి, అల్మాస్ పేట గౌతమ్, గుర్రం రవీందర్, పాలాది పాండు, మద్దోదు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

*** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శివరాజ్...**




అందోలు, ప్రజాస్ఫూర్తి : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం అని అందోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివరాజ్ అన్నారు. మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామానికి చెందిన జోగాల అంజయ్య, కటికే సోహెబ్, హన్మాండ్ల కాడి రాజేష్ గౌడ్ లకు సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం కింద మంజూరైనా చెక్కులను భాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షనే కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యం చేయుంచుకోలేని పేదలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రతీ పేద వాడికి న్యాయం జరిగేలా చూడాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బాలయ్య, నాయకులు రమేష్ గౌడ్, జనార్ధన్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి మాతకు ఘన హారతి



ప్రజా స్ఫూర్తి, భద్రాచలం: కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా గోదావరి మాతకు ఘనంగా హారతి నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయం అయిన శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.గోదావరి తీరం వద్ద ఆలయ పురోహితులు, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, నది దేవతకు హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. హారతి సందర్భంగా "జై శ్రీరామ్" నినాదాలతో పరిసరాలు మార్మోగాయి.

## పౌర హక్కుల సంఘం రాష్ట్ర మహాసభల విజయవంతం చేయండి



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర మహాసభల విజయవంతంకై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు వద్ద సోమవారం కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది కె. పుల్లయ్య మాట్లాడుతూ పౌర హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చైతన్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిఎల్‌సి జిల్లా అధ్యక్షులు ఎస్. ఉపేందర్, న్యాయవాదులు ఎర్రపాటి కృష్ణయ్య, శ్రీను, వీరమల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మక వీవీజీఎఫ్ సదస్సుకు మంత్రి సీతక్కకు ప్రత్యేక ఆహ్వానం



రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క)కు అరుదైన గౌరవం లభించింది. అంతర్జాతీయ స్థాయి మహిళా నాయకత్వ వేదిక 'వైటల్ వాయిసెస్ గ్లోబల్ ఫెలోషిప్ (వీవీజీఎఫ్)' సదస్సుకు ఆమెకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ ఆహ్వానం మేరకు మంత్రి సీతక్క ఆదివారం నాడు నెదర్లాండ్స్‌కు చేరుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళా నాయకత్వం, సామాజిక మార్పు, ప్రజా సేవా రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న నాయకులను మాత్రమే ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు ఆహ్వానిస్తారు. మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం మంత్రి సీతక్క చేసిన నిరుపమానమైన కృషిని గుర్తించిన నిర్వాహకులు ఆమెకు ఈ గౌరవాన్ని అందించారు. నెదర్లాండ్స్‌లో జరుగుతున్న ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రపంచంలోని పలు దేశాల మహిళా నాయకులు పాల్గొననున్నారు.



## భారత రాజ్యాంగాన్ని ధిక్కరించే వారు దేశద్రోహులే

*** పద్మశ్రీ" మంద కృష్ణ మాదిగ**

హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి): భారత రాజ్యాంగాన్ని ధిక్కరించే వారు దేశద్రోహులేనని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు "పద్మశ్రీ" మంద కృష్ణ మాదిగ అన్నారు.సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి పై జరిగిన అమానుష దాడి ఘటన నేపథ్యంలో దేశభక్తులు ఎవరో, దేశద్రోహులు ఎవరో అనే అంశంపై విస్తృత చర్చ జరగాలన్నారు."దేశంలో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్, అది కూడా దళితుడైన గవాయి మీద దాడి జరిగి నెలరోజులు కావస్తున్నా చట్టపరమైన చర్యలు లేకపోవడం అత్యంత దారుణం. ఒక సాధారణ ఘటనపై కూడా వ్యవస్థలు సుమోటోగా స్పందిస్తుంటే, చీఫ్ జస్టిస్‌పై దాడి జరిగినా ఎందుకు స్పందించడం లేదో అర్థంకావడం లేదు," అని ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ప్రెస్‌మీట్లో ఆయన మాట్లాడుతూ 'ధర్మం' ముసుగులో దాడులు చేస్తే చట్టం మౌనంగా ఉండకూడదని, ధర్మం, విశ్వాసం అన్నవి రాజ్యాంగం, చట్టం కిందనే ఉండాలని మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. "రాజ్యాంగం ఏర్పడిన తర్వాతనే దళితులు మనుషులుగా గుర్తింపు పొందారు. రాజ్యాంగాన్ని ధిక్కరించడం అంటే దళితుల గౌరవాన్ని ధిక్కరించడం," అని ఆయన పేర్కొన్నారు. దళితులపై దాడులు చేయడం అంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనని, అలాంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. భారతదేశంలో ఉంటూ భారత రాజ్యాంగాన్ని గౌరవించే వారే దేశభక్తులు రాజ్యాంగాన్ని అవహేళన చేసేవారు దేశద్రోహులు," అని ఆయన స్పష్టం చేశారు.గవాయిపై దాడి దళితులపై, రాజ్యాంగంపై దాడిగా ఉందని పేర్కొంటూ, దాడికి సంబంధించిన కేసు నమోదు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు.నవంబర్ 17న ఢిల్లీలో *"దళితుల ఆత్మగౌరవ ర్యాలీ"*ని విజయవంతం చేయాలని, దేశవ్యాప్తంగా ఉన్న దళితులు, అణగారిన వర్గాలు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.



## ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

జీడిమెట్ల , (ప్రజాస్ఫూర్తి): ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని పలు కాలేజీల డైరెక్టర్లు డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో పలు కాలేజీలు బంద్‌లో భాగంగా తరగతులు నిలిపివేశారు. వాటిలో భాగ్యరధి డిగ్రీ కాలేజీ (చింతల్), రాయల్ డిగ్రీ కాలేజీ, క్యాపిటల్ డిగ్రీ కాలేజీ, వంటి విద్యాసంస్థలు పాల్గొన్నాయి.ఈ కార్యక్రమంలో భాగ్యరధి డిగ్రీ కాలేజీ డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్, రాయల్ డిగ్రీ కాలేజీ డైరెక్టర్ రమేష్ బాబు, భాగ్యరధి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ కె. నవీన్ రాజ్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కాలేజీలు నేటి నుండి నిరవధిక బంద్ ప్రారంభించాయి. ఈ నిర్ణయాన్ని తెలంగాణ ప్రైవేట్ కాలేజీల సంఘం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు రూ.10,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం తక్షణం కనీసం 50% అంటే రూ.5,000 కోట్లు వెంటనే విడుదల చేయాలని, మిగిలిన 50% మొత్తాన్ని మార్చి 31, 2026లోపు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. రీయింబర్స్‌మెంట్ అడిగితే విజిలెన్స్ తనిఖీలతో బెదిరించడం సరైన పద్ధతి కాదని కాలేజీ నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి, వేలాది ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యా రంగ భవిష్యత్తును రక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజీల లెక్చరర్లు , నాన్‌టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైద్య వృత్తి మానవతా సేవకు ప్రతీక

*** కలెక్టర్ జితేష్.వి.పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వైద్య వృత్తి మానవతా సేవకు ప్రతీక అని, విద్యార్థులు నిబద్ధతతో సమాజానికి సేవ చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్.వి.పాటిల్ సూచించారు. సోమవారం కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో నూతన ఎంబీబీఎస్ విద్యార్థులకు వైట్ కోట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "వైద్య వృత్తి కేవలం ఉద్యోగం కాదు, ఇది సమాజానికి అంకితమైన పవిత్ర బాధ్యత అని అన్నారు. వైద్య విద్యార్థులు రోగుల పట్ల కరుణ , సానుభూతి, అంకితభావంతో సేవ చేయాలి" అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణలో యువ వైద్యుల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.వైద్యునిగా సమాజానికి చేసే సేవే మీ గొప్పతనం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, రోగులకు గౌరవం ఇవ్వాలన్నారు. ఈ వైట్ కోట్ కేవలం వస్త్రం కాదు —— ఇది నైతికత, సేవ, నిబద్ధతకు ప్రతీక" అని విద్యార్థులను ఉద్దేశించి



చెప్పారు.ఈ సందర్భంగా విద్యార్థులు వైద్య నైతిక ప్రమాణాల పట్ల నిబద్ధత వ్యక్తం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా 150 మంది నూతన వైద్య విద్యార్థులకు తెల్లకోటులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. శ్రీహరి రావు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రాధామోహన్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దైవ చింతనతో మానసిక ప్రశాంతత

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. సోమవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట గ్రామంలోని శ్రీ గణేశ, సుబ్రహ్మణ్య సహిత మరకత ఉమా రామలింగేశ్వర దేవాలయ పునః ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు ముఖ్యఅతిథిగా హాజరై ఉమా రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల సందర్శనతో కార్యసిద్ధి లభిస్తుందని , చేపట్టిన ప్రతి పనిలో విజయం చేకూరుతుందని అన్నారు. నీటితో అభిషేకం నిర్వహించినంత మాత్రాననే వరాలనిచ్చే దైవం ఉమా రామలింగేశ్వర స్వామి అని స్వామివారి కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల బస్సు–టిప్పర్ రోడ్డు ప్రమాదం

*** క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి**



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్-వికారాబాద్ హైవేపై జరిగిన బస్సు-టిప్పర్ రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదానికి కారణమైంది. ఈ ప్రమాదంలో 24 మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయ పడ్డారు, క్షతగాత్రులను వికారాబాద్ ప్రభుత్వ వైద్యశాల (మెడికల్ కాలేజ్ ఆసుపత్రి) కి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ఘటనపై జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి వెంటనే స్పందించి, ఆసుపత్రికి చేరుకొని గాయపడిన వారిని పరామర్శించారు. వైద్యుల నుండి బాధితుల ఆరోగ్య పరిస్థితి వివరాలు తెలుసుకున్నారు. డాక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గాయపడిన వారిని తక్షణమే మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఎముకలు విరిగిన వారికి అత్యవసర శస్త్రచికిత్సలు (ఆపరేషన్లు) చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైతే ప్రైవేట్ ఆసుపత్రుల సహాయాన్ని కూడా వినియోగించాలన్నారు. బాధితుల ప్రాణాలను రక్షించడం ప్రథమ కర్తవ్యంగా చూడాలి," అని జిల్లా మెడికల్ & హెల్త్ ఆఫీసర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, "ప్రభుత్వ వైద్య సిబ్బంది పూర్తి నిబద్ధతతో సేవలందిస్తున్నారు. మా వంతు సహాయం అవసరమైతే ఎప్పుడైనా అందిస్తామన్నారు. బాధిత కుటుంబాలకు ధైర్యం ఇవ్వడం మనందరి బాధ్యత," అని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ, ప్రమాదాల నివారణకు ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలని కూడా కోరారు.

## రేపటి నుంచి పరీక్షలు బహిష్కరిస్తున్నాం.. ప్రైవేట్ విద్యా సంస్థల సమాఖ్య మరో కీలక నిర్ణయం

ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య మరో కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ఇవాళ్టి (నవంబర్ 3) నుంచి ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థలు నిరవధిక బంద్‌ను పాటిస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ , బీఈడీ తదితర వృత్తి విద్యా , డిగ్రీ కళాశాలలు బంద్‌కు ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య పిలుపునిచ్చింది. తాజాగా సమాఖ్య మరో నిర్ణయం తీసుకుంది. రేపటి నుంచి పరీక్షలను బహిష్కరిస్తున్నామని ప్రకటించింది. ఈ నెల 8న హైదరాబాద్‌లో కాలేజీల సిబ్బందితో సమావేశం అవుతున్నట్లు తెలిపింది. ఈ నెల 11 వ తేదీన 10 లక్షల మంది విద్యార్థులతో సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది.

# ఇండ్ వాటర్ డ్రింకింగ్ అనుమతితో.. అక్రమ వ్యాపారం

* 74రకాల హోటల్స్ లేబుల్స్, 12రకాల వాటర్ బాటిల్స్ స్వాధీనం
* సీఐ మన్మధ కుమార్




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఇండ్ వాటర్ డ్రింకింగ్ అనుమతితో.. అక్రమంగా నకిలీ వాటర్ బాటిల్ లేబుల్స్ తయారుచేసి సరఫరా చేస్తున్న యజమానిని చౌటుప్పల్ పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. సీఐ మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తాళ్ళసింగారం గ్రామానికి చెందిన లోకేష్ 'ఇండ్ వాటర్ డ్రింకింగ్' పేరుతో అనుమతి పొంది, అక్రమంగా హోటల్స్ పేరుతో నకిలీ లేబుల్స్ తయారు చేసి విక్రయిస్తున్నాడని సమాచారం అందిందన్నారు. ఆకస్మిక దాడి నిర్వహించి,. అక్కడ ఉన్న 74రకాల హోటల్స్ లేబుల్స్, ఒక టీడీఎస్ మిషన్, ఒక పి హెచ్ మిషన్, 12రకాల వాటర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. సంస్థ యజమాని లోకేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మన్మధ కుమార్ తెలిపారు.

# బుద్ధుని పవిత్ర అవశేషాల ప్రదర్శన.. ఏటా మూడు రోజులే అవకాశం



వారణాసి: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాశీలో కార్తిక పౌర్ణమి సందడి నెలకొంది. స్థానికంగా దేవ్ దీపావళిని అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ తరుణంలోనే సారనాథ్‌లోని మూలగంధ కుటీ విహారలో గౌతమ బుద్ధుని పవిత్ర అవశేషాలను ప్రజాసందర్శనార్థం అందుబాటులో ఉంచారు. ఏటా కేవలం మూడు రోజులు మాత్రమే వాటిని చూడొచ్చు. ఈసారి నవంబరు 3 నుంచి 5వ తేదీ వరకు అవకాశం కల్పించారు. 1931లో కార్తిక పౌర్ణమి రోజునే సారనాథ్‌లో కొత్త బౌద్ధారామాన్ని స్థాపించి, బుద్ధుని పవిత్ర అవశేషాలతో కూడిన కలశాన్ని ప్రతిష్ఠించిన అనాగరిక ధర్మపాలుని జ్ఞాపకార్థంగా వీటిని ప్రదర్శిస్తారు. భారతీయులే కాకుండా నేపాల్, మయన్మార్, థాయ్‌లాండ్, జపాన్, శ్రీలంక తదితర దేశాల నుంచి వేలాది మంది భక్తులు బుద్ధుని పవిత్ర అవశేషాలను చూసేందుకు ఏటా ఇక్కడికి వస్తుంటారని ప్రధాన బౌద్ధ భిక్షువు శీల్‌వంశ్ తెలిపారు.

# పెను ప్రమాదం లో పాతూర్ చెరువు ..కుంగిన చెరువు కట్ట

* మరమ్మత్తు లు చేయకపోతే పెను ప్రమాదం

(ప్రజాస్ఫూర్తి, వికారాబాద్) : వికారాబాద్ మండలంలోని పాతూర్ గ్రామం చెరువు కట్ట పెను ప్రమాదం పొంచి ఉంది. చెరువు కట్ట పలుచోట్ల కుంగిపోయింది. కుంగిన ప్రదేశంలో నీళ్లు కూడా బయటకు వస్తుండడంతో కట్ట చాలా బలహీనపడింది. దీంతో ఎప్పుడు ఈ కట్టకు గండి పడి తెగిపోతుందా..! అని స్థానిక రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించకపోతే, కట్ట తెగిపోతే పాతూర్, పులుసుమామిడి, చించల్‌పేట్ గ్రామాల్లోని వందలాది ఎకరాల సారవంతమైన భూములు, పంటలు నామరూపాలు లేకుండా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



**పంట పొలాలకు తీవ్ర నష్టామే**

ప్రస్తుతం చెరువు నిండు కుండలా ఉండగా, ఏ క్షణానైనా కట్ట తెగితే, వరద ఉధృతికి క్రింద ఉన్న మూడు గ్రామాల పంట పొలాలు, ఇళ్లు, వ్యవసాయ భూములు పూర్తిగా ధ్వంసమవుతాయి. కట్టపై పలుచోట్ల 5 నుండి 10 అడుగుల లోతు వరకు మట్టి కుంగిపోయింది. పాతూర్, పులుసుమామిడి, చించల్‌పేట్ గ్రామాలలో సుమారు వందల ఎకరాలకు పైగా భూములు నేరుగా ప్రమాదంలో ఉన్నాయి. ఒకవేళ కట్ట తెగితే, కేవలం పంట నష్టమే కాక, భూములు పూర్తిగా బురద, మట్టి, రాళ్లతో నిండిపోయి, రైతులు కోలుకోలేని ఆర్థిక నష్టం ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆందోళన చెందుతున్నారు. అధికారులు నీటి పారుదల శాఖ (ఇరిగేషన్), రెవెన్యూ మరియు జిల్లా యంత్రాంగం సమన్వయం చేసుకుని, యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టాలి. లేదంటే, రేపో మాపో ఈ ప్రాంత రైతులు తీవ్రమైన జల విలయాన్ని ఎదుర్కోనే ప్రమాదం ఉంది.

# ఆ క్షణాలు ఇంకా వెంటాడుతున్నాయి ఎయిరిండియా ప్రమాద మృత్యుంజయుడు



ఎయిరిండియా ప్రమాద ఘటనలో ప్రాణాలతో బయటపడిన ఒకే ఒక్కడు విశ్వాస్ కుమార్ రమేశ్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ప్రమాదం వల్ల తనకు తీవ్ర నష్టం జరిగిందని, నాటి జ్ఞాపకాలు ఇంకా తనను వెంటాడుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాద ఘటన అనంతరం బ్రిటన్‌లో నివాసం ఉంటున్న ఆయన.. స్థానిక మీడియాకు ఇంటర్వ్యూలు ఇచ్చాడు. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదంలో విశ్వాస్ కుమార్ ఒక్కడే బయటపడ్డారు. బ్రిటన్‌లో నివాసముంటున్న విశ్వాస్ కుమార్.. గుజరాత్‌లోని తన కుటుంబానికి కలిసేందుకు వచ్చి తిరుగు ప్రయాణం అవుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ రోజు విమానంలో 11ఏ సీటులో విశ్వాస్ కుమార్ కూర్చున్నారు. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కారు. ఆ ప్రమాదంలో తన సోదరుడు అజయ్ (27)ను కోల్పోయారు.

* **జీవితం ఒక్కసారిగా మారిపోయింది..**

''అంతపెద్ద ప్రమాద ఘటన నుంచి తప్పించుకున్న నన్ను చాలా మంది 'లక్కీ మ్యాన్' అంటుంటారు. కానీ ఆ ప్రమాదం తర్వాత నా జీవితమే మారిపోయింది'' అంటూ విశ్వాస్ కుమార్ చెప్పుకొచ్చారు. ''విమాన ప్రమాదంలో నాకు కొన్ని సీట్ల అవతల కూర్చున్న సోదరుడు ప్రమాదంలో చనిపోయాడు. నాకు అన్నివేళలా అండగా ఉన్న తమ్ముడిని కోల్పోవడం చాలా బాధిస్తోంది. ఈ ప్రమాదం తర్వాత నా కుటుంబ పరిస్థితులు పూర్తిగా తలకిందులైపోయాయి. ప్రమాద ఘటనను తలచుకున్నప్పుడు రాత్రులు నిద్ర కూడా పట్టడం లేదు. ఓ వైపు గదిలో కూర్చుని నేను.. అవతల అమ్మ ఒంటరి జీవితాన్ని అనుభవిస్తున్నాం. ఇప్పటికీ నా కాలు, భుజం, మోకాలు, వెన్ను నొప్పులు ఉన్నాయి. మునుపటిలా నడవడం, డ్రైవ్ చేయడం సాధ్యం కావడం లేదు. ప్రమాదం తర్వాత భారత్‌లో మా వ్యాపారం మూతపడింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా దిగజారింది'' అంటూ విశ్వాస్ కుమార్ తన దైన్యాన్ని వివరించారు. ప్రమాద ఘటనలో తాను ఒక్కడినే ఎలా బయటపడిందీ ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు.

# దుబాయిలోని ఇండియన్ కాన్సుల్ ప్రతినిధులతో మంత్రి నారాయణ బృందం భేటీ

దుబాయి: ఏపీ మంత్రి నారాయణ బృందం దుబాయిలో పర్యటిస్తోంది. తొలి రోజు దుబాయిలోని ఇండియన్ కాన్సుల్ ప్రతినిధులు బీజీ కృష్ణన్, సెలీనా శశికాంత్‌తో మంత్రి భేటీ అయ్యారు. ఏపీ అభివృద్ధిని వారికి వివరించారు. అనంతరం శోభా గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విక్రమ్‌దత్తతో సమావేశయ్యారు. శోభా గ్రూప్ రియల్ ఎస్టేట్.. మౌలిక సదుపాయాల కల్పన రంగంలో ప్రసిద్ధి పొందిన సంస్థ. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఈ గ్రూప్ ఆసక్తి కనబరిచిన విషయం తెలిసిందే. ఆ తర్వాత భారత కాన్సుల్ జనరల్ సతీష్ శివన్‌తో కలిసి మంత్రి నారాయణ లంచ్ మీటింగ్‌లో పాల్గొన్నారు.

# సొంతింటి కల.. ప్రభుత్వంతోనే సాధ్యమైంది

* కొయ్యలగూడెంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సొంత ఇల్లు కట్టుకోవాలని కలను.. కలగా మిగలకుండా సాకారం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం సొంతమని ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలు నామని జయమ్మ సంతోషం వ్యక్తం చేశారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో తనకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని సోమవారం గృహప్రవేశం చేశారు. గృహప్రవేశానికి కాంగ్రెస్ పార్టీ మునుగోడు ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు పథకం అమలు చేసిందన్నారు. ఇల్లు లేని నిరుపేదలు సొంత ఇంటి కల నిజం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, తహసిల్దార్ వీరాబాయి, ఆర్ఐ బాణాల రాంరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నర్సింహా గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్రగుంట వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొనారు.

# తల్లి వర్ధంతి.. 290 మందికి రుణ విముక్తి



తల్లి వర్ధంతి రోజున అన్నదానాలు, వస్త్ర దానాలు నిర్వహిస్తుంటారు. పేదరికంలో ఉండేవారికి ఎంతోకొంత ఆర్థిక సాయం చేయడమూ చూస్తుంటాం. కానీ సూరత్‌కు చెందిన వ్యాపారవేత్త బాబూ భాయ్ జీరావాలా కొత్త ఆలోచన చేశారు. తాను చేయబోయే సాయం జీవితాంతం గుర్తుండిపోవాలనుకున్నారు. అలా 290 మంది రైతులను రుణ విముక్తులను చేశారు. 30 ఏళ్ల సమస్యను చిటికెలో తీర్చేశారు. గుజరాత్ ఆమ్రేలిలోని జీరా గ్రామానికి చెందిన 290 మంది రైతులది విచిత్ర పరిస్థితి. స్థానిక జీరా సేవా సహకార మండలిలో వారి పేరు మీద ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రుణాలు తీసుకున్నారు. సొసైటీ సభ్యులే దీనికి పాల్పడ్డారనేది బహిరంగ రహస్యం. కానీ, దీన్ని రుజువు చేయలేని పరిస్థితి. 1995 నుంచి ఈ సమస్య వెంటాడుతోంది. భూమి పత్రాలు సహకార సంఘంలో ఉండి పోవడంతో ప్రభుత్వం నుంచి రుణాలు గానీ, సాయం గానీ పొందలేని పరిస్థితి. అన్నదమ్ముల మధ్య ఆస్తి పంపకాలూ నిలిచిపోయాయి. ఇదే విషయంలో అధికారులకు మొరపెట్టుకున్నా.. దీని మీద విచారణ నడిచినా ప్రయోజనం శూన్యం. ఈ విషయం పారిశ్రామిక వేత్తలైన బాబూ భాయ్ జీరావాల్, ఆయన సోదరుడు ఘనశ్యామ్ భాయ్ దృష్టికొచ్చింది. తల్లి వర్ధంతి రోజున రైతులను రుణ విముక్తులను చేయాలని నిర్ణయించుకున్నారు. మొత్తం రూ.90 లక్షల రుణాన్ని ఏకమొత్తంగా బ్యాంకులో డిపాజిట్ చేసి సంబంధిత పత్రాలను రైతులకు అందించారు. ఏళ్లుగా పోరాడుతున్న తమ చేతికి భూమిపత్రాలు రావడంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కొందరు రైతులు ఆనందంతో కన్నీటి పర్యంతమయ్యారు. మరికొందరు చల్లగా ఉండాలంటూ దీవించి వెళ్లారు. ఇంతటి సాయం చేసినా ఎక్కడా తల్లి పేరును ఎక్కడా ముద్రించకపోవడం గమనార్హం. ఇలా సాయం చేయడంలో తమ తల్లే తనకు స్ఫూర్తి అని బాబూ భాయ్ చెప్పుకొచ్చారు.

# 'అనవసర అంశాలపైనే ప్రసంగాలు'.. ప్రధానిపై ప్రియాంక గాంధీ విసుర్లు!

దేశాన్ని, బిహార్‌ను అవమానించారంటూ ప్రతిపక్ష నేతలందరిపై ప్రధాని నరేంద్ర మోదీ ముద్ర వేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ విమర్శించారు. దీనికోసం కేంద్రంలో కొత్తగా 'అవమానాల మంత్రిత్వశాఖ'ను ఏర్పాటు చేయాలంటూ ఎద్దేవా చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోన్‌బర్సాలో నిర్వహించిన ప్రచార సభలో ఈమేరకు ప్రసంగించారు. ప్రధాని అనవసర విషయాలన్నీ మాట్లాడుతున్నారని, కానీ.. రాష్ట్రంలో ఎన్డీయే సర్కారు



అవినీతి, దుష్పరిపాలనపై మాత్రం నోరు మెదపడం లేదన్నారు. ''అభివృద్ధి గురించి మాట్లాడటానికి బదులుగా.. ప్రతిపక్ష నేతలు దేశాన్ని, బిహార్‌ను అవమానిస్తున్నారంటూ ప్రధాని మోదీ పదేపదే ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారాలపైనే ఎక్కువ దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. కాబట్టి.. దీని కోసం నూతనంగా 'అవమానాల శాఖ'ను ఏర్పాటు చేయాలి'' అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో రాష్ట్రానికి వరాలు ప్రకటించే ముందు.. గత 20 ఏళ్లలో ఎన్డీయే సర్కారు ఏం చేసిందో మోదీ, అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిహార్ ప్రభుత్వాన్ని నీతీశ్ కుమార్ నడపడం లేదని.. ప్రధాని, ఇతర వ్యక్తులు దిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నియంత్రిస్తున్నారని ప్రియాంక పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును లాక్కొనేందుకు చూస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతోనే యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోందన్నారు. ఉపాధి కల్పించే ప్రభుత్వ రంగ సంస్థలను భాజపా సన్నిహిత కార్పొరేట్‌లకు అప్పగించారని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. ఛఠ్ పూజ, మహా కుంభమేళాలను ప్రతిపక్ష నేతలు అవమానించారంటూ ప్రధాని మోదీ ఆదివారం ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రియాంక గాంధీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# కరూర్ తొక్కిసలాట ఘటన..విజయ్ కార్యాలయానికి సీబీఐ



తమిళనాడులోని కరూర్‌లో టీవీకే ప్రచార సభలో చోటుచేసుకున్న తొక్కిసలాట కేసుపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం సీబీఐ అధికారులు తమిళగ వెట్రి కళగం ప్రధాన కార్యాలయానికి వెళ్లినట్లు తెలుస్తోంది. తొక్కిసలాట ఘటన జరిగిన సందర్భంలో పార్టీ ప్రచారానికి హాజరైన నేతలకు సంబంధించిన వివరాలు, కార్యక్రమానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు టీవీకే పార్టీ నేత నిర్మల్ కుమార్ పేర్కొన్నారు. పలువురు నేతలను కూడా వారు విచారించినట్లు సమాచారం. ప్రచార సమయంలో తొక్కిసలాటకు గల కారణాలు తెలుసుకోవడానికి సీబీఐ అధికారులు అధునాతన 3D లేజర్ స్కానింగ్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరో వైపు ఈ ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు జరపడానికి దాదాపు 306 మందిని విచారించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకుగాను వారందరికీ సమన్లు జారీ చేశామన్నారు. గత నెల 27న టీవీకే పార్టీ అధ్యక్షుడు, సినీనటుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార సభ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. తొక్కిసలాటలో 41 మంది మృతి చెందగా.. 60 మందికిపైగా గాయపడ్డారు. మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకు ఈ ఘటనపై దర్యాప్తును తొలుత సిట్ చేపట్టింది. దీనిని సవాల్ చేస్తూ... టీవీకే సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సిట్‌పై తమకు నమ్మకంలేదని, ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరింది. పిటిషన్‌పై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం దర్యాప్తు బాధ్యతను సీబీఐకి మారుస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు బాధిత కుటుంబాలు, ప్రత్యక్ష సాక్షులతోపాటు స్థానికుల నుంచి వాంగ్మూలాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

# చేవెళ్ల రోడ్డు ప్రమాదం.. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం: పొన్నం

చేవెళ్ల: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం ప్రకటించినట్లు వెల్లడించారు. చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. 'ఈ బస్సు ప్రమాదంలో 19 మంది చనిపోయారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతోంది. మృతుల్లో పది మంది మహిళలు, 8 మంది పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు. 19 మందిలో 13 మృతదేహాలను పోలీసులు గుర్తించారు. వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటించాం. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం'' అని మంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలకు ఆర్టీసీ తరఫున రూ.2 లక్షలు ఇస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.







## ఇద్దరు చిన్నారులను అనాథలను చేసిన రోడ్డు ప్రమాదం

చేవెళ్ల: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరు చిన్నారులను అనాథలను చేసింది. ఈ ఘటనలో వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం హాజీపూర్‌కు చెందిన భార్యాభర్తలు బండప్ప, లక్ష్మి మృతి చెందారు. దీంతో వారి కుమార్తెలు భవాని, శివలీల ఒంటరిగా మిగిలిపోయారు. తల్లిదండ్రుల మృతితో కన్నీరుమున్నీరయ్యారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. చిన్నారుల రోదనతో అక్కడి వారి కళ్లు చెమ్మగిల్లాయి.

## ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు.. భూసేకరణకు ప్రభుత్వం అనుమతి



హైదరాబాద్: ఆదిలాబాద్‌లో విమానాశ్రయం కోసం భూసేకరణకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. ఎయిర్ పోర్టు కోసం భూసేకరణ చేయాలని ఆదేశించింది. ఆదిలాబాద్‌లో 700 ఎకరాలు సేకరించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని వరంగల్, ఆదిలాబాద్‌లలో బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయాలను రానున్న రెండేళ్లలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. భూసేకరణకు సంబంధించిన అన్ని ప్రక్రియలు పూర్తి కాగానే పనులు ప్రారంభించడానికి ఏఏఐ సిద్ధమవుతోంది. ఇప్పటికే వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయ అభివృద్ధికి కావాల్సిన భూసేకరణ పూర్తి కావొచ్చింది. ఇక్కడ అవసరమైన 253 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్లను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆదిలాబాద్‌లోనూ బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి భారత వాయుసేన అంగీకారం తెలుపడంతో ఏఏఐ రాబోయే రెండేళ్లలో ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయడానికి సిద్ధమవుతోంది. ఈ రెండు విమానాశ్రయాలను 2027 జూన్ నాటికి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కాగా, స్థానిక పరిస్థితులను బట్టి 2027 డిసెంబరులోగా అందుబాటులోకి తెస్తామని కేంద్రం గతంలో తెలిపినట్లు సమాచారం.



## అర్ధరాత్రి ఫోన్ చేసినా అరగంటలో వస్తాం: KTR

కాంగ్రెస్‌కు ఓటేయకపోతే పథకాలు రద్దు చేస్తామని రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ప్రజలను బెదిరిస్తున్నారని.. ఎవడబ్బ సొమ్మని పథకాలు బంద్ చేస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి ఆయన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రంజాన్ తోఫా లేదు.. బతుకమ్మ చీర లేదు.. క్రిస్మస్ గిఫ్ట్ లేదు.. ఇలా అన్నీ బంద్ అయ్యాయని.. బీఆర్ఎస్‌ను గెలిపించండి.. కాంగ్రెస్ గల్లా పట్టి పథకాలు అమలు చేపిస్తామని చెప్పారు. హైదరాబాద్‌ను బర్బాద్ చేసిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 4 కోట్ల మంది ప్రజల తరఫున 4 లక్షల మంది జూబ్లీహిల్స్ ప్రజలు తీర్పు చెప్పబోతున్నారని అన్నారు. బోరబండలో వచ్చిన జనాన్ని చూస్తుంటే గెలుపు పక్కా అని తేలిపోయిందని.. మెజార్టీ ఎంత అనేది తేలాల్సి ఉందని అన్నారు. కేసీఆర్ తిరిగి ఈ రాష్ట్రానికి నాయకత్వం వహించాలని ప్రజలు కోరుకుంటున్నారని.. ఒక్కరిని కూడా మోసం చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విడిచిపెట్టలేదని చెప్పారు.

### ఇంకా హామీల అమలు లేదు..

'కాంగ్రెస్ హామీలు ఇచ్చి రెండేళ్లైంది.. ఇంకా అమలు కావట్లేదు' అని కేటీఆర్ విమర్శించారు. స్కూటీలు రాలేదని.. ఇందిరమ్మ ఇల్లు రాలేదని.. రూ.4వేలు పెన్షన్ లేదని.. ఏ ఒక్క హామీ అమలు కాలేదని పేర్కొన్నారు. రేవంత్‌కు ఒక్క చాన్స్ ఇస్తేనే 160 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని.. ఒక్క చాన్స్ ఇస్తే పేదల ఇళ్లు కూలగొట్టారని.. మహిళలను మోసం చేశారని.. హైదరాబాద్‌ను నాశనం చేశారని.. రియల్ ఎస్టేట్‌ను దెబ్బ తీశారని అన్నారు. ఫస్ట్ ప్లేస్‌లో ఉన్న తెలంగాణను లాస్ట్ ప్లేస్‌కు దిగజార్చారని తెలిపారు. పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు రాకూడదంటే సునీతమ్మను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు కారు, బుల్డోజర్ మధ్య జరుగుతున్నాయని.. బుల్డోజర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అన్నారు. హైడ్రా బాధితుల బాధను చూస్తే ప్రతి ఒక్కరికీ కళ్లలో నీళ్లు వస్తాయని.. హైడ్రా పేరుతో వేలాది మంది ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చిందని చెప్పారు. హైడ్రా అనే రాక్షసి మాయం కావాలంటే ఈ నెల 11న కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

## పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలు మార్చండి.. కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



హైదరాబాద్: పత్తి కొనుగోళ్లలో సీసీఐ విధించిన నిబంధనలు మార్చాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలన్న సీసీఐ కొత్త నిబంధన నేపథ్యంలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తాకు లేఖ రాశారు. సాధారణంగా ఇప్పటి వరకు ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తుండగా.. ఎకరాకు 11.74 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ల నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం డిక్లరేషన్ ఇచ్చిందని ఆ లేఖలో ప్రస్తావించారు. ''ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధన పత్తి రైతులకు నష్టం చేసేలా ఉంది. తేమ శాతం విషయంలో 20శాతం వరకు ఉన్నా సరే పత్తి పంట సీసీఐ కొనుగోలు చేయాలి. కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన లేకపోవడం వల్ల కూడా పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని 7 క్వింటాళ్ల నిబంధన ఎత్తి వేసి పాత పద్ధతిలో పత్తి కొనుగోళ్లు చేయాలి. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలి''అని మంత్రి తుమ్మల కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## చేవెళ్ల దుర్ఘటన.. బస్సు డ్రైవర్ తప్పేం లేదు: ఆర్టీసీ ప్రకటన



హైదరాబాద్: చేవెళ్ల బస్సు దుర్ఘటనపై తెలంగాణ ఆర్టీసీ అధికారులు వివరణ ఇచ్చారు. ఈ ప్రమాదంలో 19మంది దుర్మరణం చెందడంపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆర్టీసీ ప్రకటన విడుదల చేసింది. టిప్పర్ అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొంది. రోడ్డు మలుపులో అతివేగం వల్ల టిప్పర్ డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడని, ఈ ప్రమాదానికి ఆర్టీసీ బస్సు గానీ, బస్సు డ్రైవర్ గానీ కారణం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆర్టీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. ''బస్సు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉంది. డ్రైవర్ సర్వీసు రికార్డులోనూ గతంలో యాక్సిడెంట్లు లేనట్టు తేలింది. రోడ్డు మలుపు వద్ద అతి వేగంతో ఉన్న టిప్పర్ డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. తెల్లవారు జామున 4.40 గంటలకు తాండూరు నుంచి బయలుదేరిన ప్రైవేట్ హైర్ (పి.హెచ్.బి) ఎక్స్‌ప్రెస్ బస్సును కంకర లోడుతో ఎదురుగా వచ్చిన టిప్పర్ బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగంతో పాటు ఎడమవైపు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఢీ కొట్టిన టిప్పర్, బస్సు వైపు ఒరిగిపోయి అందులోని కంకర ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక ఎక్కువ మంది ప్రయాణికులతో పాటు బస్సు డ్రైవర్ దస్తగిరి మృతిచెందారు. ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుష్రో షా ఖాన్, ఇంఛార్జి (ఆపరేషన్స్) ఈడీ శ్రీధర్, రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత తదితరులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను ముమ్మరం చేశారు'' అని పేర్కొంది.

## అత్యుత్తమ నైపుణ్య శిక్షణ అందిస్తాం



వచ్చే ఏడాదిలో 120 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ)ను ప్రారంభించి.. కొత్తగా 1.2 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. హైటెక్ సిటీలోని నాలెడ్జ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన వాన్‌గార్డ్ న్యూ ఇండియా ఆఫీస్ (గ్లోబల్ వాల్యూ సెంటర్)ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఈ ఉద్యోగాలను అందిపుచ్చుకునేలా కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్‌లో అత్యుత్తమ నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. హైదరాబాద్ ప్రస్తుతం విశ్వసనీయత, సమగ్రత, ఇన్నోవేషన్‌కు చిరునామాగా మారిందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద పెట్టుబడి నిర్వహణ సంస్థల్లో ఒకటైన వాన్‌గార్డ్ తమ 'గ్లోబల్ వ్యాల్యూ సెంటర్ (జీవీసీ)ను ప్రారంభించేందుకు హైదరాబాద్‌ను ఎంచుకోవడం ఈ నగర సామర్థ్యానికి నిదర్శనమన్నారు. వాన్‌గార్డ్ ప్రపంచవ్యాప్తంగా 6.4 ట్రిలియన్ డాలర్ల ఆస్తులను నిర్వహిస్తున్నదని, అలాంటి సంస్థ మన దగ్గర కార్యకలాపాలు ప్రారంభించడం మనకు గర్వకారణమన్నారు. ప్రపంచ ఆర్థిక, సాంకేతిక పటంలో తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అవుతుందన్నారు. ప్రస్తుతం వరల్డ్ టాప్ 7 అస్సెట్ మేనేజ్మెంట్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కంపెనీలు 30 ట్రిలియన్ డాలర్ల ఆస్తులను నిర్వహిస్తున్నాయని వివరించారు. ఈ కొత్త జీవీసీ ఇంజనీరింగ్ ఎక్సలెన్స్, క్లౌడ్ మోడర్నైజేషన్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీకి ఒక హబ్‌గా సేవలు అందిస్తుందన్నారు. ఇది వాన్‌గార్డ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్‌లో నూతన ఆవిష్కరణలకు మార్గ నిర్దేశం చేస్తుందన్నారు. వాన్ గార్డ్‌లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

## 85 శాతం మెడికల్ పీజీ సీట్ల జీవో విడుదల



ప్రైవేట్, మైనారిటీ మెడికల్ కళాశాలలలో పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో తెలంగాణ విద్యార్థులకు పెద్ద పీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ సోమవారం జీవో జారీ చేసింది. ఈ జీవో ఎంఎస్ నెం. 201 ప్రకారం ప్రైవేట్, మైనారిటీ మెడికల్ కళాశాలలలో పీజీ కోర్సులలో మేనేజ్‌మెంట్ కోటా (సబ్‌కేటగిరీ-1) సీట్లలో 85శాతం సీట్లను తెలంగాణ రాష్ట్ర స్థానికులకు కేటాయించనున్నారు. ఇక మిగిలిన 15శాతం సీట్లు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు "ఆల్ ఇండియా కోటా" కింద ఇవ్వబడతాయి. ఇప్పటివరకు ఈ సీట్లన్నీ కూడా పూర్తిగా జాతీయ స్థాయిలోనే భర్తీ చేస్తూ వచ్చారు. ఫలితంగా గత పదేళ్లుగా తెలంగాణ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వచ్చిన రెండో ఏడాదే స్థానిక విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ మార్పు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది. కాగా... స్థానిక విద్యార్థులు సీట్లు కోల్పోతున్న అంశంపై దిశ గత నెల 6వ తేదీన "85శాతం సీట్లు మనకే దక్కాలి" పేరిట కథనం ప్రచురించింది. ఆంధ్రప్రదేశ్ లో స్థానిక కోటా ఉన్నప్పుడు మన వద్ద ఎందుకు తీసుకురావడం లేదంటూ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయింది. జీవో సవరించకపోవడంతో సుమారు 382 పీజీ సీట్లను మన రాష్ట్ర విద్యార్థులు కోల్పోతున్న తీరును ప్రభుత్వం దృష్టికి దిశ తీసుకుపోవడంతో పాటు వెంటనే సర్కారు స్పందించి లోకల్ విద్యార్థులకు న్యాయం చేయాలని సూచించింది. మరోవైపు ఈ అంశంపై అనేక మార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తూ వచ్చిన టీ జూడా సైతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసింది.

# కార్తీక మాసం రద్దీ.. ప్రముఖ ఆలయాల్లో భక్తుల భద్రతపై పవన్ కీలక ఆదేశాలు

అమరావతి: పవిత్రమైన కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ ఆలయాలకు భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో కాకినాడ జిల్లా పరిధిలోని ప్రముఖ క్షేత్రాల్లో భక్తుల భద్రత, సౌకర్యాల కల్పనపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. క్యూ లైన్ల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, భద్రతాపరమైన అంశాలపై అధికారులు సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులకు పుణ్య క్షేత్రాలు, దేవాలయాల్లో ఏర్పాట్లపై పవన్ దిశానిర్దేశం చేశారు.

* కాశీబుగ్గలో తొక్కిసలాట ఘటన నేపథ్యంలో దేవాదాయ శాఖ ఆలయాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రసిద్ధ క్షేత్రాలతోపాటు ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల నిర్వహణలో ఎన్ని ఆలయాలు ఉన్నాయో దేవాదాయ శాఖ అధికారులు నివేదిక సిద్ధం చేసి జిల్లా కలెక్టర్, ఎస్పీలకు తక్షణమే అందజేయాలి.
* కాకినాడ జిల్లా పరిధిలో ప్రముఖ క్షేత్రాలైన సామర్లకోట కుమార భీమేశ్వరస్వామి ఆలయం, పిఠాపురం శ్రీ పాద గయ, అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయాలతోపాటు పలు ప్రధాన ఆలయాల్లో కార్తీక మాసంలో భక్తుల తాకిడి



ఎక్కువగా ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలి.

* ఆయా ఆలయాల్లోనూ భక్తుల రద్దీ విషయమై పర్యవేక్షణ చేయాలి. ఈ నెల 5న కార్తీక పౌర్ణమి ఉన్నందున ఆ రోజు, ఆ మరుసటి రోజు ఉండే రద్దీని అంచనా వేసుకోవాలి.
* మరీ ముఖ్యంగా శని, ఆది, సోమవారాల్లో భక్తుల సంఖ్య ఊహించని విధంగా పెరుగుతోంది. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా దేవాదాయ, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి.
* భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ ప్రాంగణంలో క్యూలైన్ల నిర్వహణ ఉండాలి. క్యూ లైన్లపైనా, ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
* భక్తుల రద్దీకి తగిన విధంగా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం, చెత్త పేరుకుపోకుండా పారిశుద్ధ్య నిర్వహణను స్థానిక సంస్థల యంత్రాంగం చేపట్టాలి.
* భక్తుల రద్దీని బట్టి ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ బస్సులు నడపాలి. రద్దీ సమయాల్లో ఆయా క్షేత్రాల మీదుగా వెళ్లే జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ ప్రమాదాలకు తావులేకుండా తగిన చర్యలు తీసుకోవాలి.
* రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో ఆలయాల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

## అప్పలరాజు మాస్టారూ.. మీ కళాత్మక బోధనా శైలి చూడముచ్చటగా ఉంది: మంత్రి లోకేశ్

అమరావతి: శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు బల్లెడ అప్పలరాజును మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఆయన కళాత్మక బోధనా శైలి చూడముచ్చటగా ఉందని కొనియాడారు. ఈ మేరకు మంత్రి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "బల్లెడ అప్పలరాజు మాస్టారు.. మీ కళాత్మక బోధనా శైలి చూడముచ్చటగా ఉంది. పాతపట్నంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో బోటనీ సబ్జెక్టు బోధిస్తూనే సహ ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో ల్యాబ్‌ను ఆకర్షణీయంగా, విజ్ఞానవంతంగా తీర్చిదిద్దిన తీరు స్ఫూర్తినిస్తోంది. సైన్స్, మోరల్ వేల్యూస్, జనరల్ నాలెడ్జ్ ప్రతిబింబించేలా ల్యాబ్‌ను ఆర్టిస్టిక్‌గా రూపొందించి, నిర్వహిస్తున్న తీరు అభినందనీయం" అని లోకేశ్ పేర్కొన్నారు.



ల్యాబ్‌కు సంబంధించిన వీడియోను ఈ సందర్భంగా మంత్రి షేర్ చేశారు.

## జోగి రమేశ్‌ను కస్టడీకి కోరుతూ ఎక్సైజ్‌శాఖ పిటిషన్

అమరావతి: నకిలీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేశ్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఏపీ ఎక్సైజ్ శాఖ పిటిషన్ దాఖలు చేసింది. జోగి రమేశ్‌తోపాటు ఆయన సోదరుడు రామును 10 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఇదే కేసులో అద్దేపల్లి సోదరులను ఎక్సైజ్ శాఖ రెండోసారి కస్టడీకి కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ ఈ నెల 6కి



వాయిదా పడింది. నకిలీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేశ్, ఆయన సోదరుడు రాముకు న్యాయస్థానం ఈ నెల 13 వరకు రిమాండ్ విధించిన నేపథ్యంలో వారిద్దర్నీ విజయవాడ జైలు నుంచి నెల్లూరు జైలుకు తరలించిన సంగతి తెలిసిందే. ఆదివారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జోగి రమేశ్‌ను అరెస్టు చేసిన సిట్ అధికారులు.. తూర్పు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సుమారు 12 గంటలపాటు విచారించారు. ఆయనతోపాటు ఆయన సోదరుడు రాముని వేర్వేరుగా, కలిపి ప్రశ్నించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జనార్దనరావుతో సంబంధాలపై ఆరా తీశారు. వైద్య పరీక్షల అనంతరం ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసులు ఆయన్ను న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వాదనలు ప్రారంభమయ్యాయి. న్యాయమూర్తి తెల్లవారుజామున 5 గంటలకు రిమాండ్ విధిస్తూ తీర్పు వెలువరించారు.



## ట్రావెల్స్ బస్సు బోల్తా.. ఇద్దరి మృతి.. పలువురికి గాయాలు

లింగపాలెం: ఏలూరు జిల్లా లింగపాలెంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఏలూరు నుంచి హైదరాబాద్ వెళ్తోన్న భారతి ట్రావెల్స్ బస్సు.. జూబ్లీనగర్ సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందగా.. 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను దగ్గర్లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## ఎస్వీయూలో విద్యార్థినులపై ప్రొఫెసర్ వేధింపులు
### విద్యార్థి సంఘాల ఆందోళన

తిరుపతి (ఎస్వీయూ): శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విద్యార్థినులపై ప్రొఫెసర్ వేధింపుల ఘటన కలకలం రేపింది. సైకాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డి విద్యార్థినుల్ని వేధిస్తున్నారని, సీనియర్ విద్యార్థులతో ర్యాగింగ్ చేయిస్తున్నట్లు నలుగురు విద్యార్థినులు రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని గుట్టుచప్పుడు కాకుండా పరిష్కరించేందుకు మహిళా హాస్టల్ వార్డెన్లను పిలిపించి రాజీ ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరగడంతో విద్యార్థి సంఘాల నేతలు రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకొని ఆందోళనకు దిగారు. రెక్టార్ అప్పారావు బాధిత విద్యార్థినుల్ని తన ఛాంబర్‌కు పిలిపించి ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డితో రాజీ చేయించేందుకు ప్రయత్నించారన్న సమాచారంపై విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెక్టార్ ఛాంబర్ తలుపులు పగులగొట్టి లోపలికి దూసుకెళ్లారు. అనంతరం రిజిస్ట్రార్, రెక్టార్లు



విద్యార్థి సంఘాల నేతలతో సమావేశమై చర్చించారు. సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేస్తూ తక్షణ చర్యలు చేపట్టారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య నరసింగరావు దిల్లీలో ఉన్నందున రిజిస్ట్రార్ ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రొఫెసర్‌పై విచారణ కమిటీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై ఎస్పీకి సైతం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వీసీ బుధవారం తిరిగి వచ్చిన తర్వాత కమిటీ ఏర్పాటు చేసి ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డిని సస్పెండ్ చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థి సంఘాలు ఆందోళనను విరమించాయి. ఈ ఆందోళన సమయంలో పోలీసులతో జరిగిన తోపులాటలో పలువురు విద్యార్థి నేతలు గాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఎన్ఎల్ఎస్ఏ, జీఎన్ఎస్, జేబీఎస్ఎఫ్ నాయకులు రవి, అక్బర్, అశోక్, వినోద్, చలపతి, జెన్నె మల్లికార్జున, సుందర్ రాజు, శివశంకర్ నాయక్, తిరుమలేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ఆదరణ3 పథకం అమలు: మంత్రి సవిత

విజయవాడ: త్వరలో ఆదరణ 3 పథకం అమలు చేయబోతున్నట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత వెల్లడించారు. విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ పథకానికి రూ. వెయ్యి కోట్లు వెచ్చించబోతున్నట్లు చెప్పారు. పథకం అమలుపై బీసీ కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లతో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. నకిలీ మద్యం కేసుపై మంత్రి సవిత స్పందించారు. ఈ కేసుపై వైకాపా సీబీఐ విచారణ కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 'బాబాయి గొడ్డలిపోటు'పై సీబీఐ దర్యాప్తును వైకాపా ఎందుకు కోరట్లేదని ప్రశ్నించారు.



## ఏపీలో పెట్టుబడులకు ముందుకొచ్చిన వరల్డ్ స్మార్ట్ సిటీ ఫోరం

విజయవాడ: ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దక్షిణ కొరియాకు చెందిన వరల్డ్ స్మార్ట్ సిటీ ఫోరం ముందుకొచ్చింది. ఇందులో భాగంగా ప్రకాశం జిల్లా దొనకొండలో 25 ఎకరాల విస్తీర్ణంలో 480 మిలియన్ డాలర్ల వ్యయంతో చన్ జాంగ్ ఉన్ చల్లా క్యాన్సర్ సెంటర్‌ను నెలకొల్పనుంది. ఈ మేరకు విజయవాడ పార్క్ హయత్ హోటల్లో ఏర్పాటు చేసిన



విలేకరుల సమావేశంలో క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి ఐదు భాగస్వామ్య కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం వరల్డ్ స్మార్ట్ సిటీ ఫోరం అధ్యక్షుడు పీటర్ చున్ మాట్లాడుతూ.. ఈ తరహా క్యాన్సర్ సెంటర్‌ను చెన్నైలోనూ ప్రారంభించామని, అక్కడ వైద్య సేవలు కొనసాగుతున్నాయని చెప్పారు. దొనకొండలో సెంటర్ నిర్మాణం అనంతరం మెడిసిన్ తయారీ, డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్ తయారీ, ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఓ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం చేస్తామన్నారు. అనంతరం చల్లా గ్రూప్ అధినేత చల్లా ప్రసాద్ మాట్లాడుతూ.. తాను ప్రకాశం జిల్లా వాసినని, తనకు జన్మనిచ్చిన ప్రాంతంలో దక్షిణ కొరియాకు చెందిన వరల్డ్ స్మార్ట్ సిటీ ఫోరం సహకారంతో చన్ జాంగ్ ఉన్ చల్లా క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు చేస్తుండటం సంతోషంగా ఉందన్నారు. ఏపీలో పెట్టుబడుల కోసం సీఎం చంద్రబాబు చేస్తోన్న నిరంతర కృషి ప్రశంసనీయమన్నారు.

## కాశీబుగ్గలో దుర్ఘటన దురదృష్టకరం : కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



కాశీబుగ్గలో చోటు చేసుకున్న దుర్ఘటన దురదృష్టకరం అని కేంద్ర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం లోక్ సభ సభ్యుడు కింజారపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో పలువురు మృతి చెందడం మనసును కలచివేసిందన్నారు. రాష్ట్ర మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష, జిల్లా అధికారులతో కలిసి మృతుల కుటుంబాలను స్వయంగా పరామర్శించారు. వారి కుటుంబానికి జరిగిన నష్టం పట్ల సంతాపాన్ని ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎక్స్ గ్రేషియా చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పలాసా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న భక్తులను కూడా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై ఆసుపత్రి సిబ్బందిని ఆరా తీశారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

## రెండ్రోజుల నష్టాలకు బ్రేక్...

లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

రెండ్రోజుల నష్టాలకు తెరదించుతూ లాభాల్లో ముగిసిన సూచీలు

స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్న సెన్సెక్స్, నిఫ్టీ

మార్కెట్లకు అండగా నిలిచిన ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియాల్టీ షేర్లు

ప్రధాన సూచీల కన్నా మెరుగ్గా రాణించిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్

మారుతీ సుజుకీ, టైటాన్, టీసీఎస్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి

మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్‌బీఐ షేర్లు లాభాల్లో పయనం



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు రెండ్రోజుల వరుస నష్టాలకు సోమవారం బ్రేక్ వేశాయి. తీవ్ర ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో చివరికి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియాల్టీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాల నుంచి సూచీలు కోలుకున్నాయి.

సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 39.78 పాయింట్లు లాభపడి 83,978.49 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 41.25 పాయింట్ల లాభంతో 25,763.35 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలో నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్, ఆ తర్వాత కోలుకుని ఒక దశలో 84,127 గరిష్ఠ స్థాయిని కూడా తాకింది.

విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీ రోజంతా 25,700 నుంచి 25,800 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. 25,660-25,700 స్థాయి వద్ద బలమైన మద్దతు లభించడంతో నష్టాల నుంచి బయటపడింది. కీలక అంతర్జాతీయ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో మార్కెట్ సానుకూలంగానే ఉందని వారు విశ్లేషించారు.

సెన్సెక్స్ స్టాక్స్‌లో మారుతీ సుజుకీ 3 శాతానికి పైగా నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. టైటాన్ కంపెనీ, బీఈఎల్, టీసీఎస్, ఐటీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్ వంటి షేర్లు కూడా నష్టపోయాయి. మరోవైపు, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టాటా మోటార్స్, హెచ్‌సీఎల్ టెక్ ప్రధాన లాభాల్లో ఉన్నాయి.

ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మెరుగ్గా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.77 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.72 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.92 శాతం పెరిగి ర్యాలీకి నాయకత్వం వహించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా 5 శాతం మేర లాభపడగా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా లాభాల్లో ముగిశాయి. మెటల్, రియాల్టీ సూచీలు కూడా 2 శాతం వరకు పెరిగాయి. అయితే, ఎఫ్ఎంసీజీ, ప్రైవేట్ బ్యాంక్, ఐటీ రంగాల సూచీలు నష్టపోవడం మార్కెట్ లాభాలను పరిమితం చేసింది.

దేశీయంగా కొత్త సానుకూల అంశాలు ఏవీ లేకపోవడంతో అధిక స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారని, అయినప్పటికీ కొన్ని రంగాలలో కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు గ్రీన్‌లో ముగిశాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. త్రైమాసిక ఫలితాల ఆధారంగా ఇన్వెస్టర్లు స్వల్ప, మధ్యకాలిక వ్యూహాలను అనుసరిస్తున్నారని వారు పేర్కొన్నారు.

## టాటా ట్రస్ట్స్ నుంచి తొలగింపు..

న్యాయపోరాటానికి సిద్ధమైన మెహ్లీ మిస్త్రీ



**న్యూఢిల్లీ:** టాటా గ్రూప్ దాతృత్వ సంస్థ టాటా ట్రస్ట్స్‌లో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. దివంగత పారిశ్రామిక వేత్త రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీకి టాటా ట్రస్ట్స్ నుంచి తొలగించిన విషయం తెలిసిందే. టాటా గ్రూప్‌నకు చెందిన మూడు కీలక దాతృత్వ ట్రస్ట్‌లకు జీవితకాల ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీని పునర్నియమించేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం లభించలేదు. టాటా ట్రస్ట్స్ చైర్మన్ నియోల్ టాటా, మరో ఇద్దరు ట్రస్టీలు.. మిస్త్రీ పునర్నియామకాన్ని గట్టిగా వ్యతిరేకించారు. దీంతో మిస్త్రీ న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. ముంబై ఛారిటీ కమిషనర్ వద్ద కేవియట్ దాఖలు చేసినట్లు తెలిసింది.

రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీ 2022లో టాటా ట్రస్ట్స్‌కు ట్రస్టీగా నియమితులయ్యారు. అయితే, ఆయన మూడేండ్ల పదవీకాలం అక్టోబరు 28తో ముగిసింది. దీంతో ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీ మూడేండ్ల పదవీకాలం ముగుస్తుండటంతో ఆయన పునర్నియామకం చేపట్టారు. ఇందుకోసం అనుమతిని కోరుతూ ఇతర ట్రస్టీలకు టాటా ట్రస్ట్స్ సీఈఓ ఇటీవలే ఒక సర్క్యులర్ పంపారు. అయితే, ఈ ప్రతిపాదనను ట్రస్టీలు నోయల్ టాటా, టీవీఎస్ మోటర్ కంపెనీ చైర్మన్ ఎమిరేట్స్ వేణు శ్రీనివాసన్, రక్షణ శాఖ మాజీ కార్యదర్శి విజయ్ సింగ్ వ్యతిరేకించారు. ఇదే సమయంలో సిటీబ్యాంక్ ఇండియా మాజీ సీఈవో ప్రమిత్ ఝవేరి, ముంబైకి చెందిన న్యాయవాది డారియస్ ఖంబాట, పుణెకు చెందిన ఫిలంత్రోఫిస్ట్ జహంగీర్ హెచ్‌సీ జహంగీర్‌లు మిస్త్రీకి మద్దతు పలికారు. అయినప్పటికీ మిస్త్రీ పునర్నియామకానికి ఆమోదం లభించలేదు.

## అనిల్ అంబానీకి షాక్.. ఇల్లు సహా రూ.3 వేల కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ



**ముంబై:** ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి మరో షాక్ తగిలింది. మనీలాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు అనిల్ అంబానీకి చెందిన రూ.3,084 కోట్ల విలువైన 40కిపైగా ఆస్తులను అటాచ్ చేసింది. అక్టోబర్ 31న ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు.

ఈడీ అటాచ్ చేసిన ఆస్తుల్లో ముంబైలోని పాలి హిల్ ప్రాంతంలో గల అనిల్ అంబానీ నివాసం, న్యూఢిల్లీలోని రిలయన్స్ సెంటర్, ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ముంబై, పూణె, థానే, హైదరాబాద్, చెన్నైల్లో అనిల్ అంబానీ కంపెనీలకు చెందిన పలు నివాస, వాణిజ్య ఆస్తులు ఉన్నాయి. కాగా, అనిల్ అంబానీకి చెందిన గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి.



## ప్రధాని మోదీని కలవనున్న

# టీమిండియా అమ్మాయిలు

మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన టీమిండియా

విజేత జట్టుతో ప్రధాని మోదీ బుధవారం భేటీ

క్రీడాకారుణులకు బీసీసీఐ రూ. 51 కోట్ల భారీ నజరానా ప్రకటన

ఫైనల్లో సత్తా చాటిన షఫాలీ వర్మ, దీప్తి శర్మ

ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో ఘన విజయం

నవీ ముంబై నుంచి ఢిల్లీకి బయల్దేరనున్న జట్టు సభ్యులు

**ముంబై:** మహిళల వన్డే ప్రపంచకప్‌లో చారిత్రక విజయం సాధించి, తొలిసారి కప్పును ముద్దాడిన భారత జట్టు సభ్యులు ప్రధాని నరేంద్ర మోదీని కలవనున్నారు. ఐసీసీ మెగా టోర్నీ విజేతలుగా నిలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన బుధవారం ఢిల్లీలో ప్రధానితో సమావేశం కానున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ చారిత్రక విజయాన్ని పురస్కరించుకుని బీసీసీఐ జట్టుకు రూ. 51 కోట్ల భారీ నగదు బహుమతిని ప్రకటించింది.

ఆదివారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శన చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' షఫాలీ వర్మ (87) అద్భుత ఇన్నింగ్స్, 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' దీప్తి శర్మ (58) మెరుపులతో 7 వికెట్లకు 298 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) శతకంతో పోరాడినా, భారత బౌలర్ల ధాటికి తలవంచక తప్పలేదు. ముఖ్యంగా దీప్తి శర్మ 5 వికెట్లతో సత్తా చాటడంతో దక్షిణాఫ్రికా 246 పరుగులకే ఆలౌట్ అయింది. దీప్తి ఆఖరి వికెట్ తీయగానే దేశవ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. భారత సీనియర్ మహిళల జట్టుకు ఇదే తొలి ఐసీసీ ట్రోఫీ కావడంతో ఈ విజయం మరింత ప్రత్యేకంగా నిలిచింది.

ప్రస్తుతం నవీ ముంబైలో ఉన్న క్రీడాకారిణులు, సహాయక సిబ్బంది మంగళవారం సాయంత్రం ఢిల్లీకి బయల్దేరనున్నారు. ప్రధానితో సమావేశం అనంతరం వారు తమ స్వస్థలాలకు వెళతారు. జట్టుకు ప్రకటించిన రూ. 51 కోట్ల నగదు బహుమతిని క్రీడాకారులు, సహాయక సిబ్బంది, ఐదుగురు సభ్యుల జాతీయ సెలక్షన్ కమిటీకి పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది.

లీగ్ దశలో వరుసగా మూడు ఓటముల తర్వాత అద్భుతంగా పుంజుకున్న టీమిండియా, సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాపై 339 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టించింది. ఆ తర్వాత ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించి, స్వదేశంలో అభిమానుల మధ్య టైటిల్ గెలిచి దశాబ్దాల నిరీక్షణకు తెరదించింది.

## ఫాస్ట్ బౌలర్ రేణుకా సింగ్‌కు రూ.కోటి నజరానా ప్రకటించిన సర్కారు..!



**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఫాస్ట్ బౌలర్ రేణుకా సింగ్‌కు హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం నజరానా ప్రకటించింది. రూ.కోటి పారితోషకాన్ని ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సోమవారం ఈ నజరానాను ప్రకటించారు. రేణుకా ప్రతి పర్వతప్రాంతం అమ్మాయి కలను నెరవేర్చిందని సీఎం పేర్కొన్నారు. పోరాటాలను అధిగమించి ప్రపంచ కప్ గెలిచిన జట్టులో భాగం కావడం దేశానికి, హిమాచల్‌కు గర్వకారణమన్నారు.

రేణుక అభిరుచి, నమ్మకంతో ప్రతి లక్ష్యాన్ని సాధించవచ్చని చూపించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేణుకతో పాటు ఆమె కుటుంబాన్ని సీఎం అభినందించారు. రేణుక దివంగత తండ్రికి తాను సెల్యూట్ చేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన ప్రేరణ నేడు మొత్తం హిమాచల్‌కు గర్వకారణంగా మారిందన్నారు. రేణుకా సింగ్‌తో సీఎం ఫోన్లో మాట్లాడారు. ప్రపంచ కప్‌లో విజయం సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టును సైతం ఆయన అభినందించారు. ప్రపంచ కప్‌లో రేణుక ప్రదర్శనను కూడా ముఖ్యమంత్రి ప్రశంసించారు.

## తెర వెనుక హీరో 'అన్‌మోల్' మొజుందార్..

జాతీయ జట్టుకు ఆడలేదు కానీ వరల్డ్‌కప్ తెచ్చిపెట్టాడు



**ముంబై:** హర్మన్‌ప్రీత్ నేతృత్వంలోని టీమిండియా మహిళల క్రికెట్ జట్టు వన్డే వరల్డ్‌కప్ గెలిచిన విషయం తెలిసిందే. భారత మహిళల జట్టు సాధించిన కీర్తి వెనుక అమొల్ మొజుందార్ పాత్ర ఎంతో కీలకమైంది. మహిళల జట్టు కోచ్‌గా అమొల్ మొజుందార్ .. భారత బృందాన్ని శక్తివంతంగా తీర్థిదిద్దారు. ముంబై క్రికెటర్ అయిన మొజుందార్.. గతంలో ఇండియాకు ఆడలేదు. కానీ ఆయనకు స్వదేశీ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో విశేష అనుభవం ఉన్నది. ఫస్ట్ క్లాస్‌లో 11,167 రన్స్ చేశాడు. జాతీయ జట్టుకు ఆడకపోయినా.. మొజుందార్ మాత్రం తన కలలను సాకారం చేసుకున్నాడు. ఇండియాకు వరల్డ్‌కప్ వచ్చేలా ప్రయత్నించాడు. వరల్డ్‌కప్ గెలిచిన హర్మన్ బృందానికి కోచ్‌గా ఎనలేని గురు బాధ్యతలను ఆయన పోషించారు.

ముంబై జట్టు తరపున రంజీ అరంగేట్రం మ్యాచ్‌లో మొజుందార్ ఇరగీశాడు. ఆ మ్యాచ్‌లో 260 రన్స్ స్కోర్ చేశాడు. అయితే మొజుందార్ క్రికెట్ కెరీర్ ఆయనకు అనుకూలించలేదు. ఆ సమయంలో భారత జట్టులో సచిన్, ద్రావిడ్, లక్ష్మణ్, గంగూలీ లాంటి హేమాహేమీలు ఉండేవారు. దీంతో ఆయనకు జాతీయ జట్టు మిడిల్ ఆర్డర్‌లో చోటు దక్కలేదు. కేవలం ఫస్ట్ క్లాస్‌కే పరిమితమైన మొజుందార్.. 2014లో రిటైర్మెంట్ తీసుకున్నాడు. 21 ఏళ్ల పాటు అతను ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాడు. కానీ ఫస్ట్ క్లాస్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన 11 ఏళ్ల తర్వాత.. భారత బ్యాటింగ్ బరువును తన భుజాలపై మోసాడతను. మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్ గెలవడానికి ఆయన అనుభవం ఎంతగానో పనిచేసింది.

హర్మన్ టీం వరల్డ్‌కప్ గెలవడం పట్ల హెడ్ కోచ్ మొజుందార్ సంతోషం వ్యక్తం చేశారు. ఆ ఆనందాన్ని ఆయన గ్రౌండ్‌లోనే పంచుకున్నారు. భావోద్వేగంతో జాతీయ జెండాను పట్టుకుని రెపరెపలాడించారు. మాటలు రావడం లేదని, గర్వంగా ఉందని, ఈ సంతోషానికి ఆ అమ్మాయిలు అర్హులు అని ట్రోఫీ గెలిచిన తర్వాత మొజుందార్ అన్నారు. హార్డ్‌వర్క్, నమ్మకం కలిసివచ్చాయని, ఆ అమ్మాయిలు ప్రతి భారతీయుడిని గర్వంగా నిలిపారన్నారు.

2023లో భారత మహిళల క్రికెట్ జట్టుకు కోచ్‌గా అమొల్ మొజుందార్ బాధ్యతలు స్వీకరించారు. టీమ ప్రదర్శన పట్ల ఆయన టోర్నీ మొత్తం హర్షం వ్యక్తం చేశారు. ఆరంభంలో ఒడిదుడుకులు ఎదురైనా, వెనక్కి తగ్గేదన్నారు. దాదాపు చాలా మ్యాచుల్లో డామినేట్ చేశామన్నారు. బెటర్‌గా ఫినిష్ చేయాలన్న ఉద్దేశాన్ని వ్యక్తం చేశానన్నారు. ఫైనల్లో షఫాలీ వర్మ పర్ఫార్మెన్స్‌ను మొజుందార్ మెచ్చుకున్నాడు.

## సచిన్‌తో మాట్లాడిన తర్వాత

# కొత్త ఉత్సాహం వచ్చింది

వరల్డ్ కప్‌లో కీలక పాత్ర పోషించిన షెఫాలీ వర్మ

మ్యాచ్‌కు కొన్ని సెకన్ల ముందు సచిన్‌తో మాట్లాడానన్న షెఫాలీ వర్మ

సచిన్ టెండుల్కర్ తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపారన్న షెఫాలీ వర్మ

మ్యాచ్‌కతు ముందు సచిన్‌ను చూడగానే ప్రత్యేకంగా ఏదైనా సాధించగలననే నమ్మకం వచ్చిందని వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** ఫైనల్ మ్యాచ్‌కు ముందు సచిన్ టెండుల్కర్‌తో మాట్లాడానని, ఆయనతో మాట్లాడిన తర్వాత తనకు తెలియని కొత్త ఉత్సాహం వచ్చిందని ఐసీసీ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో దూకుడుగా ఆడిన ఓపెనర్ షెఫాలీ వర్మ వెల్లడించింది. దక్షిణాఫ్రికాతో జరిగిన మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో షెఫాలీ వర్మ అదరగొట్టిన విషయం తెలిసిందే. వందకు పైగా స్ట్రైక్ రేటుతో 87 పరుగులు చేసి బ్యాటింగ్‌లో రాణించింది. బౌలింగ్‌లో కూడా రెండు వికెట్లు తీసి ఫైనల్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది.

కప్ గెలిచిన అనంతరం ఆమె మాట్లాడుతూ, మ్యాచ్‌కు కొన్ని క్షణాల ముందు సచిన్‌తో తాను మాట్లాడిన మాటలతో అంతా మారిపోయిందని తెలిపింది. టెండుల్కర్‌ను చూడగానే తనకు ఎక్కడా లేని ఉత్సాహం వచ్చిందని, ఆయన తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపారని పేర్కొంది. మాస్టర్‌ను చూస్తే స్ఫూర్తి కలుగుతుందని తెలిపింది. ఈ విజయం ద్వారా కలిగిన సంతోషాన్ని మాటల్లో వర్ణించలేనని ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

ప్రశాంతంగా ఉంటే ఏదైనా సాధించగలమని తనకు అర్థమైందని, ఎలాంటి గందరగోళం లేకుండా ఆటపై మాత్రమే దృష్టి సారించానని ఆమె తెలిపింది. జట్టులోని ప్రతి ఒక్కరు తనను ప్రోత్సహించారని వెల్లడించింది. ఏమీ ఆలోచించకుండా తన ఆట తాను ఆడుకోవాలని చెప్పారని గుర్తు చేసుకున్నది. మ్యాచ్‌కు ముందు సచిన్ సర్‌ను చూడగానే తాను ప్రత్యేకంగా ఏదైనా సాధించగలననే నమ్మకం కలిగిందని ధీమా వ్యక్తం చేసింది.

ఢిల్లీ క్రికెటర్ ప్రతీక్ రావల్ గాయపడటంతో హర్యానాకు 21 ఏళ్ల చెందిన షెఫాలీ వర్మ అనూహ్యంగా జట్టులోకి వచ్చింది. సెమీస్‌లో అంతగా రాణించలేదు. ఫైనల్‌లో మాత్రం బ్యాట్, బంతితో అద్భుతం చేసింది.

MOVIE TIME

# మహేశ్‌బాబు యవ్వన రహస్యం ఏమిటో: రష్మిక





టాకీస్: మహేశ్‌బాబు యవ్వన రహస్యం ఏమిటో తెలుసుకోవాలని ఉందని నటి రష్మిక ఆసక్తిని వ్యక్తం చేసింది. రష్మిక కథానాయికగా రూపొందిన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. అల్లు అరవింద్ సమర్పకులు. దీక్షిత్‌శెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రష్మిక సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ప్రస్తుతం పాన్ ఇండియా ఫిల్మ్స్ చేస్తున్నా. నేరుగా తమిళ మూవీ చేయడానికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుతం చాలా వరకూ చర్చల దశలోనే ఉన్నాయి. త్వరలోనే ఇది కార్యరూపం దాల్చుతుందని భావిస్తున్నా. నాకంటూ కొంతమంది బెస్టీస్ ఉన్నారు. పబ్లిక్‌లో వాళ్ల పేరు చెబితే నన్ను చంపేస్తారని అంటూ సరదాగా కామెంట్ చేశారు. మహేశ్‌బాబులో మీకు నచ్చేది ఏదని అడిగితే.. సర్‌కి ఎప్పటికీ వయసు అయిపోవడం లేదు. పైగా నానాటికీ వయసు తగ్గుతోంది. అది నాకు బాగా ఇష్టం. అదెలా సాధ్యమో నాకు తెలుసుకోవాలని ఉందని చిలిపిగా చెప్పింది. ది గర్ల్‌ఫ్రెండ్, థామా వీటిల్లో ఏ సినిమా చేయటం మీకు అత్యంత కష్టంగా అనిపించిందని అడగ్గా ది గర్ల్‌ఫ్రెండ్ మూవీయే అంటూ తెలిపింది.



## శివలో మోహన్‌బాబును రిజెక్ట్ చేసిన వర్మ



**టాకీస్:** తెలుగు సినిమా చరిత్రను రాయాల్సి వస్తే, 'శివ'కు ముందు తర్వాత అంటూ పేర్కొంటారు సినీ విశ్లేషకులు. కేవలం తెలుగు మూవీపైనే కాదు, భారతీయ సినిమాలో ఒక ట్రెండ్‌ను సృష్టించింది. రాంగోపాల్‌వర్మ దర్శకత్వంలో నాగార్జున కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం కల్ట్ మూవీగా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. అత్యాధునిక హంగులతో, 4కె విజువల్స్‌తో నవంబరు 14న ఈ మూవీ మరోసారి ప్రేక్షకులకు ముందుకు రానున్న సందర్భంగా ఈ ఆసక్తికర విషయాలు మీకోసం..'శివ' సినిమాలో నటించిన నాగార్జున, రఘువరన్, అమల ఇలా ఓ నలుగురైదుగురు మినహాయిస్తే, అందరూ కొత్తవారు. ఇందులోని ఓ పాత్ర కోసం విలక్షణ నటుడు మోహన్‌బాబు పేరును చిత్ర బృందం పరిశీలించింది. అటు దర్శకత్వశాఖతో పాటు, ఇతర టెక్నీషియన్స్ కూడా అప్పుడే ఇండస్ట్రీకి వచ్చారు. ఈ సినిమా కథా చర్చలు జరుగుతుండగా, రఘువరన్ దగ్గర రౌడీగా పనిచేసే గణేశ్ పాత్రకు ఎవరిని తీసుకోవాలా?అని చర్చిస్తుండగా, నిర్మాత అక్కినేని వెంకట్ మోహన్‌బాబు పేరును సూచించారు. హీరోకు వార్నింగ్ ఇచ్చే స్థాయి ఉండాలంటే అందరికీ తెలిసిన నటుడు అయితే బాగుంటుందని సలహా ఇచ్చారు. పైగా అప్పటికే ఆయన ప్రతినాయకుడిగా పలు పాత్రల్లో నటించి మెప్పించారు. ఆయనతో తనకున్న పరిచయంతో సులభంగా ఒప్పిస్తానని కూడా చెప్పారు. అయితే, ఇందుకు రాంగోపాల్‌వర్మ ససేమిరా అన్నారు. ఆ పాత్రలో మోహన్‌బాబును పెట్టుకుంటే ఆ సీన్ ఎఫెక్టివ్‌గా ఉండదని అన్నారట. అందుకు కారణం కూడా వర్మ చెప్పారు. 'తెలుగు ప్రేక్షకులకు మోహన్‌బాబు సుపరిచితులు. ఆయన నటన, డైలాగ్ డిక్షన్ ప్రత్యేకంగా ఉంటుంది. అలాంటి వ్యక్తి 'శివ' పాత్రకు వార్నింగ్ ఇస్తుంటే, ఆ పాత్రలో ప్రేక్షకుడికి మోహన్‌బాబు కనపడతారు తప్ప, కరుడుగట్టిన రౌడీ కనిపించడని వర్మ అన్నారట. దీంతో ఆ పాత్రలో విశ్వనాథ్ అనే నటుడుని తీసుకున్నారు. ఇక 'శివ'లో ఎలాంటి డూప్ లేకుండా నాగార్జున ఒక స్టంట్ చేశారు. లారీని పట్టుకుని సైకిల్‌పై వెళ్లడం. తనని చంపడానికి వచ్చిన రౌడీల నుంచి తప్పించుకునే క్రమంలో పాపను సైకిల్‌పై ఎక్కించుకుని నాగార్జున వెళుంటారు. అప్పట్లో అది అంత డేంజరస్ షాట్ అని వర్మకు అనిపించలేదట. సైకిళ్లపై వెళ్లేవాళ్లు చాలా మంది లారీ చైన్‌లు, బస్సులను పట్టుకుని వెళ్లడం గమనించిన ఆయన అలాంటి సన్నివేశాన్నే ఇందులోనూ తీశారు. నాగార్జున కూడా ఎలాంటి భయం లేకుండా ఆ షాట్ చేశారు. ఇక క్లైమాక్స్‌లో భవంతిపై జరిగే ఫైట్ సీన్‌లో గాలి ఎఫెక్ట్ కోసం పెద్ద ప్రొఫెల్లర్‌ను మోసుకుంటూ పది అంతస్తులు ఎక్కింది చిత్ర బృందం. ఈ సీక్వెన్స్‌లో నాగార్జున, రఘువరన్ ఒకరి మెడను మరొకరు నొక్కుకుంటూ కనిపిస్తారు. ఈ సన్నివేశం తీసే సమయానికి రఘువరన్‌కు డేట్స్ కుదరలేదు. దీంతో నాగార్జున కనిపించే సీన్‌లో డూప్‌ను పెట్టి, హైదరాబాద్‌లో షూట్ చేయగా, రఘువరన్ కనిపించే సీన్‌ను చెన్నైలో తీశారు.

## మనశంకర వరప్రసాద్ బిజీ



**టాకీస్:** సంక్రాంతి బరిలో 'మన శంకరవరప్రసాద్‌గారు'గా సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఈ మూవీ షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే చాలా పార్ట్ పూర్తయ్యింది. పాటలు కూడా మంచి రెస్పాన్స్ క్రియేట్ చేస్తున్నాయి. ఆయన టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ సినిమాని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ఆదివారం నుంచి హైదరాబాద్‌లో క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్రారంభించుకుంది. చిరుతో పాటు ఫైటర్స్ బృందంపై తెరకెక్కిస్తున్న ఈ భారీ పోరాట ఘట్టానికి యాక్షన్ కొరియోగ్రాఫర్ వెంకట్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులకు మరిచిపోలేని అనుభూతిని అందిస్తుందని చిత్ర వర్గాలు తెలిపాయి. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఈ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాలో హీరో వెంకటేశ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు.

## ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ "డ్రాగన్" సినిమా రెండు భాగాలుగా..



**టాకీస్:** మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ , మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ "డ్రాగన్" . కొద్ది రోజులు బ్రేక్ తీసుకున్న చిత్ర బృందం ఇప్పుడు శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ మాస్ ప్రాజెక్ట్‌ను మైత్రి మూవీ మేకర్స్ సంస్థ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇప్పటికే రెండు భారీ షెడ్యూళ్లు పూర్తయ్యాయి. లీకైన ఔట్‌పుట్ చూసి ఫ్యాన్స్‌లో భారీ ఆసక్తి నెలకొంది. మొదట "డ్రాగన్" సినిమాను ఒకే భాగంగా తెరకెక్కించాలని అనుకున్న మేకర్స్, ఇప్పుడు రెండు పార్ట్స్‌గా ప్లాన్ చేసినట్టు సమాచారం. కథలో ఉన్న కంటెంట్‌ను దృష్టిలో ఉంచుకుని, రెండు భాగాలుగా తీసిన కూడా సినిమాకు నష్టం ఉండదని యూనిట్ భావిస్తోందట.

ఇక, ప్రశాంత్ నీల్‌కి రెండు భాగాల సినిమాలపై ప్రత్యేక నైపుణ్యం ఉంది. ఆయన దర్శకత్వంలో వచ్చిన "కేజీఎఫ్" ఫ్రాంచైజీ రెండు భాగాలుగా వచ్చి భారీ విజయం సాధించింది. ఆ తర్వాత ప్రభాస్‌తో చేసిన "సలార్ పార్ట్ 1: సీజ్ ఫైర్" కూడా మంచి హిట్‌గా నిలిచింది. అయితే సీక్వెల్ "సలార్ 2: శౌర్యాంగ పర్వం" ఇంకా సెట్స్ మీదకు రాలేదు. కానీ, ఎన్టీఆర్‌తో వస్తున్న "డ్రాగన్" మాత్రం రెండు భాగాలుగా ఒకేసారి షూట్ జరుపుకొని, తక్కువ గ్యాప్‌లో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అంటే మొదటి భాగం తర్వాత రెండో భాగం కోసం ఫ్యాన్స్ ఎక్కువగా ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా ఉంటుందని తెలుస్తోంది.ఇక సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకమైన హైలైట్‌గా నిలుస్తుందని టాక్. ఈ చిత్రం ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇవ్వబోతుందని యూనిట్ చెబుతోంది.

ప్రస్తుతం సినిమా ప్రమోషన్స్ కోసం సరైన ముహూర్తం చూసి స్ట్రాటజీ సిద్ధం చేస్తోందట టీమ్. ఇక మాస్ అండ్ స్టైలిష్ యాక్షన్ సీక్వెన్సులతో కూడిన ఈ చిత్రం, విడుదలయ్యే సమయానికి పాన్ ఇండియా లెవెల్‌లో భారీ హంగామా సృష్టించబోతోందని సినీ వర్గాలు అంటున్నాయి. దర్శకుడు ప్రశాంత్ నీల్ , హీరో జూనియర్ ఎన్టీఆర్, హీరోయిన్ రుక్మిణి వసంత్ కాంబినేషన్ నుంచి వస్తున్న "డ్రాగన్" సినిమా నిజంగా ఫ్యాన్స్‌కి డబుల్ ఫీస్ట్ ఇవ్వబోతోందనే అంచనాలు ఉన్నాయి.

## నానికి తల్లిగా సోనాలి కులకర్ణి

టాకీస్: సోనాలి కులకర్ణికి జాతీయ స్థాయిలో మంచి పేరుంది. మరాఠీ, హిందీ, గుజరాతీ, తమిళ, ఇంగ్లీష్ చిత్రాలలో నటించిన సోనాలీ కులకర్ణి ఏ పాత్ర చేసినా అందులోకి పరకాయ ప్రవేశం చేస్తుంది. నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న 'ది ప్యారడైజ్' మూవీలో సోనాలి కులకర్ణి కీలక పాత్రను పోషిస్తోంది. నవంబర్ 3 సోనాలి కులకర్ణి పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'ది ప్యారడైజ్' మేకర్స్ ఆమెకు శుభాకాంక్షలు తెలియచేస్తూ ఓ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సినిమా నుండి వచ్చిన 'రా స్టేట్ మెంట్' గ్లింప్స్ కు సోనాలి కులకర్ణి ఇచ్చిన వాయిస్ నూ ఎవ్వరూ అంత తేలికగా మర్చిపోరు. ఓ పెక్యులర్ మాడ్యుల్ లో సోనాలి కులకర్ణి 'రా' గా చెప్పిన డైలాగ్స్ డైనమేట్ మాదిరి పేలాయి. ఆ గ్లింప్స్ లోని వాయిస్ ను వింటే... నాని తల్లి పాత్రను సోనాలి కులకర్ణి చేస్తోందనే విషయం బోధపడుతుంది. ఇందులో ఆమె పాత్ర కూడా అద్భుతంగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. చాలామంది సోనాలి కులకర్ణి నటిస్తున్న తొలి తెలుగు సినిమా 'ది ప్యారడైజ్' అనుకుంటారు కానీ ఆమె చాలా కాలం క్రితమే తెలుగులో మోహన్ కోడా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'ఎల్లమ్మ' అనే చిత్రంలో నటించింది. ఆ సినిమాలో నాజర్, రేవతి కీలక పాత్రలు పోషించారు. ఇక 'ది ప్యారడైజ్' విషయానికి వస్తే... ఎస్.ఎల్.వి. సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ప్రొడ్యూస్ చేస్తున్న ఈ మూవీలో మరో కీలక పాత్రను విలక్షణ నటుడు మోహన్ బాబు చేస్తున్నాడు. అవినాశ్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్న ఈ సినిమా వచ్చే యేడాది మార్చి 26న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో విడుదల కానుంది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.